

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts


సంపుటి - 03 సంచిక -135 | పేజీలు - 8 | వెల ₹03/- | మంగళవారం 1 సెప్టెంబర్ 2026



వెలిగొండకు కృష్ణాజలాలు



వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు.. నల్లమల గిరుల నుంచి పరుగులు పెట్టిన కృష్ణమ్మ



పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మూడు జిల్లాల ప్రజల కల సాకారం

దోర్నాల వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి


తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు

ప్రారంభోత్సవానికి భారీగా హాజరైన రైతులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు

ప్రకాశం/దోర్నాల ఆగస్టు, 31 (రిపబ్లిక్ న్యూస్).

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమైంది. పశ్చిమ ప్రకాశంలోని కరవు పీడిత ప్రాంతాలకు జీవనాడిగా భావిస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద ప్రాజెక్టు సొరంగాల నుంచి ఉరకలేస్తూ వచ్చిన కృష్ణా జలాలకు ఆయన భక్తిశ్రద్ధలతో జలహారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంతో ఆ ప్రాంత రైతులు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ సందర్భంగా గంటవానిపల్లె ఫీడర్ కెనాల్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్వయంగా నీళ్లలోకి దిగి కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి హారతి ఇచ్చారు. అంతకుముందు, జలహారతి ప్రదేశానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం

మిగతా 2లో.



మెస్సీ శకం ముగిసింది

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరఫున బరిలోకి దిగనని

మిగతా 2లో.

విశాఖకు ఏఐజీ

రూ.2,000 కోట్లతో వెయ్యి పడకల హాస్పిటల్..

మంత్రి లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన

విశాఖలో ఏఐజీ హాస్పిటల్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన

ఈ ప్రాజెక్టు ద్వారా 9 వేల మందికి ఉపాధి అవకాశాలు

రెండు దశల్లో నిర్మాణం.. 2028 నాటికి తొలి దశ పూర్తి

ఒకే క్యాంపస్‌లో వైద్య సేవలు, శిక్షణ, పరిశోధన కేంద్రాలు

విశాఖ ఆగస్టు, 31 (రిపబ్లిక్ న్యూస్).

ఆంధ్రప్రదేశ్ వైద్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. ఆసియాలోనే ప్రసిద్ధి గాంచిన ఏఐజీ (ఏఐజీ) హాస్పిటల్స్ ఇప్పుడు విశాఖపట్నంలో కొలువుదీరనుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ మెగా హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.



మిగతా 2లో.



యుద్ధానికి ముగింపు కావాలి

ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్‌కు మోదీ స్పష్టమైన సందేశం

అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి ముగింపు వైపు వెళ్లాలన్న మోదీ

న్యూఢిల్లీ,ఆగస్టు, 31 (రిపబ్లిక్ న్యూస్).

కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన దౌత్యపరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి స్వస్తి పలికే దిశగా అడుగులు వేయాలి" అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ సూచించారు.

మిగతా 2లో.

తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా

ఏపీకి నీళ్లు ఇస్తున్నారు

ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్

హైదరాబాద్ ఆగస్టు, 31 (రిపబ్లిక్ న్యూస్).

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు.



మిగతా 2లో.

పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు సహకరించాలి

పారిశ్రామిక వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు

మంగళగిరి, ఆగస్టు, 31 (రిపబ్లిక్ న్యూస్).

రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి,



మిగతా 2లో.



2లో.

పెట్రోల్‌లో ఇథనాల్ శాతం చెప్పాల్సిందేనంటూ పిల్..

విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

పిటిషనర్ సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని సూచన

పాత వాహనాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పిటిషన్‌లో వాదన

ఇలాంటి పిల్‌ను గతంలోనే తోసిపుచ్చామని తెలిపిన కేంద్రం

వెలిగొండకు కృష్ణాజలాలు





మొదటిపేజీ తరువాయి

పండితులు ముఖ్యమంత్రికి శ్రీశైలం మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు.

నల్లమల కొండలను తొలుచుకుంటూ నిర్మించిన రెండు భారీ సొరంగాల నుంచి కృష్ణా జలాలు గంటవానిపల్లె ఆక్విడెక్టుకు చేరుకుని, అక్కడి నుంచి నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి పరుగులు తీశాయి. ఈ దృశ్యాన్ని సభా ప్రాంగణం నుంచి వీక్షించిన మార్కాపురం రైతులు, మహిళలు పులకించిపోయారు. తమ ప్రాంతానికి కృష్ణమ్మ రావడంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.

ఈ చారిత్రక కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, డీబీవీ స్వామి, అనగాని సత్యప్రసాద్, పార్థసారథి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దశాబ్దాల నిరీక్షణకు కూటమి ప్రభుత్వం తెరదించిందని, ఇచ్చిన మాట ప్రకారం వెలిగొండను పూర్తి చేసిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు: చంద్రబాబు

ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకున్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు.

1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. “పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం“ అని చంద్రబాబు అన్నారు.

ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. “గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?“ అని ఆయన ప్రశ్నించారు.

సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన ఆనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.

వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి

ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని ఆయన పునరుద్ఘాటించారు.

ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళ్లు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.

అది మోదీతోనే సాధ్యం

దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మార్కాపురాన్ని రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగం చేశామని, 2028 నాటికి వెలిగొండ రెండో దశను కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు.

విశాఖకు ఏఐజీ

మొదటిపేజీ తరువాయి

రూ.2,000 కోట్ల పెట్టుబడి, 9,000 ఉద్యోగాలు

విశాఖలో నెలకొల్పనున్న ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం ఏఐజీ యాజమాన్యం ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. నిర్మాణం పూర్తయితే వెయ్యి పడకల సామర్థ్యంతో ఇది ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద వైద్య కేంద్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడగలదని అంచనా వేస్తున్నారు.

రెండు దశల్లో నిర్మాణం.. ప్రపంచ స్థాయి సేవలు

హాస్పిటల్ నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి సేవలు ప్రారంభించాలని భావిస్తున్నారు. మిగిలిన 350 పడకలతో రెండో దశను ఆ తర్వాత రెండేళ్లలో పూర్తి చేస్తారు. మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో హాస్పిటల్ క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు.

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, 50కి పైగా వైద్య విభాగాలతో ప్రపంచ స్థాయి సేవలు అందించనున్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా ఒకేచోట శిక్షణ, పరిశోధన, రోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సదుపాయాలతో ఒక సంపూర్ణ హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నారు.

శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆసుపత్రి నిర్మాణ ప్రణాళికలు, భవిష్యత్ సేవలకు సంబంధించి రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ)ను మంత్రి వీక్షించారు.



ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు, ఏఐజీ వైస్ ఛైర్మన్ పీవీఎస్ రాజు, డైరెక్టర్ జీవీ రావు, సీఈవో సామ్ రిజ్వీ, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

యుద్ధానికి ముగింపు కావాలి

మొదటిపేజీ తరువాయి

ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని యావత్ మానవాళి కోరుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సంక్షోభ పరిష్కారానికి ఉద్దేశించిన ప్రతి శాంతియుత ప్రయత్నానికి భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. “ఏ సమస్యనైనా శాంతియుత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలన్నదే భారత్ నిశ్చితాభిప్రాయం. ఇది సకల మానవాళి శ్రేయస్సుకు అత్యవసరం. యుద్ధం కొనసాగే ప్రతి రోజూ మానవ ప్రగతిని వెనక్కి నెడుతుంది. కాబట్టి దీనికి తక్షణమే ముగింపు పలకాలి“ అని మోదీ వివరించారు. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారత గడ్డ ఎల్లప్పుడూ శాంతి మార్గాన్నే బోధిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. 2022లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో “ఇది యుద్ధాల యుగం కాదు“ అని పుతిన్‌తో మోదీ చేసిన చారిత్రాత్మక వ్యాఖ్యలకు కొనసాగింపుగానే తాజా సందేశం సాగింది. అటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ జరిపిన ప్రతి సంభాషణలోనూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత్ నొక్కి చెబుతూ వస్తోంది.

కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

ప్రధాని మోదీ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో ఆ మీటింగ్ జరిగింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం ‘ఎక్స్‘ వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు.ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

మొదటిపేజీ తరువాయి

సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రకటన విడుదలయ్యింది.

పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు.అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పరిశ్రమల యాజమాన్యాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా విశాఖపట్నం వంటి నగరాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేసి, పట్టణ ప్రజలు కాలుష్య ప్రభావానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీ సిటీ, పరవాడ తదితర ప్రాంతాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలాలు (సాఇజిలు) కూడా 33 శాతం పచ్చదనాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని

మెస్సీ శకం ముగిసింది.. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్

మొదటిపేజీ తరువాయి

సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు. ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.“ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను“ అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. “ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను“ అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు.తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణాలను మెస్సీ స్పష్టంగా వివరించాడు. జూలైలో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌పై అర్జెంటీనా ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపాడు. ఆ ఓటమి తర్వాత రెండు రోజులకే, అంటే జూలై 21నే తాను ఈ వీడ్కోలు లేఖను రాసుకున్నట్లు వెల్లడించాడు. అయితే, ఇటీవల మా నాన్న మరణం తర్వాత, ఇక కొనసాగలేనన్న నమ్మకం బలపడింది“ అని పేర్కొన్నాడు. మెస్సీకి తండ్రి జార్జ్ మెస్సీనే ఏజెంట్‌గా వ్యవహరించారు. సుదీర్ఘ అనారోగ్యంతో ఆగస్టు 8న మరణించిన విషయం తెలిసిందే. కాలం గడిచిపోవడం, కొత్త తరం క్రీడాకారులు జట్టులోకి రావడం కూడా తన నిర్ణయానికి ఒక కారణమని మెస్సీ వివరించాడు. “నాకు మిగిలింది తక్కువ సమయమే. నా జీవితంలో కొన్ని అధ్యాయాలు ముగింపు దశకు వస్తున్నాయి. అందులో ఇది ఒకటి. ఇది నన్ను చాలా బాధిస్తోంది. నేను జాతీయ జట్టులో భాగమవ్వడాన్ని ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశాను. ఇక ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. అంతేకాకుండా, అద్భుతమైన యువ క్రీడాకారులు వస్తున్నారు. వారికి అవకాశం దక్కాలి“ అని పేర్కొన్నాడు.

రెండు దశాబ్దాల తన అంతర్జాతీయ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన అభిమానులకు మెస్సీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. “గడిచిన 20 ఏళ్లుగా మీరు చూపించిన ప్రేమకు, మద్దతుకు ధన్యవాదాలు. స్టేడియం లోపలి నుంచి మీ కేరింతలను నేను చాలా మిస్ అవుతాను. ఇకపై నేను కూడా మీలో ఒకడిగా, మంచి చెడు సమయాల్లో, ముఖ్యంగా కష్టకాలంలో బయటి నుంచి జట్టుకు మద్దతు ఇస్తాను“ అని తెలిపాడు. తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులకు, కోచ్‌లకు, సహచర ఆటగాళ్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపాడు. “ఈ అందమైన, అదే సమయంలో కఠినమైన ప్రయాణంలో నాతో పాటు ఉన్న నా కుటుంబానికి ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి కోచ్, సహచరుడు, అధికారికి నా కృతజ్ఞతలు. ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకాలను, క్షణాలను నాతో పాటు తీసుకువెళుతున్నాను“ అని పేర్కొన్నాడు.

పెట్రోల్‌లో ఇథనాల్ శాతం చెప్పాల్సిందేనంటూ పిల్..

విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో ఇథనాల్ శాతం ఎంతో తప్పనిసరిగా వెల్లడించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సోమవారం ధర్మాసనం సూచించింది.న్యాయవాది ఎన్.కె. గోస్వామి సుప్రీంకోర్టులో ఈ పిల్ దాఖలు చేశారు. పెట్రోల్ నాజిల్లపై, జారీ చేసే రశీదులపై ఇథనాల్ శాతాన్ని స్పష్టంగా ముద్రించాలని ఆయన కోరారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్‌కు ఏయే వాహనాలు అనుకూలంగా ఉంటాయో తెలిపే అధికారిక డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ముఖ్యంగా 2023 కంటే ముందు తయారైన పాత వాహనాలకు జు20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వాడకం వల్ల తలెత్తే సమస్యల నుంచి రక్షణ కల్పించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై వాటి వివరాలను వెల్లడించినట్లే, తాము కొనుగోలు చేసే ఇంధనం గురించి తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని ఆయన వాదించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ప్రసన్న బి. వరాళేలతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ఈ పిటిషన్‌ను వ్యతిరేకించారు. ఇది ఒక ‘ప్రాక్సీ పిటిషన్‘ అని, ఇదే తరహా వ్యాజ్యాన్ని 2025 సెప్టెంబర్‌లోనే సుప్రీంకోర్టు కొట్టివేసిందని ఆయన గుర్తుచేశారు.ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్‌పై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ, పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. జు20 పెట్రోల్ వల్ల వాహనాల యాక్సిలరేషన్ మెరుగుపడటంతో పాటు ఉద్గారాలు తగ్గుతాయని, దీనివల్ల రైతులకు మేలు జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే.

బస్సు దిగాలంటే భయం

ప్రమాదాలు జరిగినప్పుడు ప్రత్యేకంగా నిఘా తర్వాత యధావిధి



పాణ్యం ప్రతినిధి , ఆగస్టు 31.(ప్రజా రిపబ్లిక్ న్యూస్). మండలం లోని స్థానిక బలపనూరు మెట్ట వద్ద ఆర్టీసీ బస్సులను జాతీయ రహదారిపై నిలుపుతున్నారు. దీంతో బస్సులు ఎక్కాలన్నా.. దిగాలన్నా భయంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బల పనూరు, కౌలూరు, భూపనపాడు, గోనవరం , నందివర్గం పలుకూరు,తదితర గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచే వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ లక్షలు ఖర్చు చేసి సర్వీస్ రహదారులున్నా బస్సులను మాత్రం జాతీయ రహదారిపైనే నిలుపుతున్నారు. దీంతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు హైవే దాటేం దుకు అవస్థలు పడుతున్నారు. వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొంటే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని గ్రామీణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ రహదారిపైనే బస్సులు నిలిపేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చిప్పగిరి లో డ్రగ్స్ వద్దు బ్రో ర్యాలీ





చిప్పగిరి, ఆగస్టు, 31,(రిపబ్లిక్ న్యూస్) చిప్పగిరి నందు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ సోమవారం ప్రిన్సిపల్ వరదరాజులు, లెక్చరర్ సుబ్రహ్మణ్యం, ఆధ్వర్యంలో నిర్వహించారు, లెక్చరర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల శారీరక మానసిక ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని, వ్యక్తిగత జీవితం తో పాటు కుటుంబాలు ఆర్థికంగా సామాజికంగా రోడ్డున పడతాయని, మత్తు కు దూరంగా ఉండి ఉజ్వలమైన భవిష్యత్తును మరియు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని యువతకు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో జరీనా బేగం, సరళ, కుమార్, శ్రీనివాసులు, రఫీ, ప్రభాకర్, అరుణ్, ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు జనసేన శ్రేణుల సన్నాహాలు

సెప్టెంబర్ 2న బైక్ ర్యాలీ.. మెగాసిరి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జన్మదిన వేడుకలు

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 31)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2న జనసేన పార్టీ ఆధ్వర్యంలో కర్నూలులో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు తెలిపారు.

కర్నూలులోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం జనసేన నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అనంతరం నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని మెగాసిరి ఫంక్షన్ హాల్‌లో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ రాష్ట్ర యువజన విభాగాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమాన్ని కర్నూలు జిల్లా జనసేన శ్రేణులు, అభిమానులు వీక్షించేందుకు మెగాసిరి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నట్లు చింత సురేష్ బాబు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మందుబాబుకు 3 రోజులు సాధారణ జైలు శిక్ష

ఆళ్లగడ్డ ఆగష్టు 31 రిపబ్లిక్ న్యూస్



ఆళ్లగడ్డ రూరల్ S I వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల ఆగస్టు 26వ తేదీన వాహనాల తనిఖీ చేయుచుండగా అతిగా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నెంబర్ AP 402KG 8567 పల్సర్ ద్విచక్ర వాహనం పై చింతమాను శ్రీనివాసులుఅనే వ్యక్తిమోటార్ సైకిల్ నడుపుతూ వస్తుండగా రూరల్ పోలీస్ అధికారులు వాహనాన్ని ఆపి బ్లీతింగ్ అన్లాజర్ తో పరీక్షించగా 550ఎస్ర్/100ఎశ్రీ పరిమితికి మించి మోతాదు నిర్ధారణ అయింది. అతిగా మద్యం సేవించిన వ్యక్తిని ఈరోజు అరెస్టు చేసి ఆళ్లగడ్డ స్పెషల్ మెజిస్ట్రేట్ శ్రీ రవికుమార్ ఎదుట హాజరుపరచగా ముద్దాయికి 3రోజులు సాధారణ జైలు శిక్ష విధించారని రూరల్ S I తెలిపారు

ఓటర్ల డ్రాఫ్ట్ నోటీసులపై విచారణకు సరైన పత్రాలతో హాజరు కావాలి :తల్లెం భరత్ కుమార్ రెడ్డి.

రైల్వే కోడూరు ఆగస్టు 31 రిపబ్లిక్ న్యూస్



రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబులవారిపల్లి మండలం పరిధిలోని మంగంపేట గ్రామపంచాయతీ బూత్ నెంబర్ 172లో డ్రాఫ్ట్ నోటీసులకు సంబంధించిన విచారణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, బిఎల్ఏ లు చంటితో కలిసి నోటీసులు అందుకున్న ఓటర్లకు అవగాహన కల్పించారు. డ్రాఫ్ట్ నోటీసులు పొందిన ప్రతి ఒక్క ఓటరు విచారణ జరుగుతున్న ప్రాంతానికి చేరుకోవాలని వారు సూచించారు. ఓటర్ కార్డుతో పాటు దానికి సంబంధించిన సరైన ఆధార పత్రాలను డాక్యుమెంట్లను జతచేసి అధికారులకు అందించి స్పందించాలని కోరారు.ఓటు హక్కు పరిరక్షణ మరియు సరిదిద్దుబాట్ల కోసం ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా ఈ విచారణకు హాజరుకావాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ఓటర్లు పాల్గొన్నారు.

18 సంవత్సరాలు నిండిన యువత కొత్త ఓటరు గా నమోదు చేసుకోవాలి

:-డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు(సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు)

పాములపాడు ఆగస్టు 31 రిపబ్లిక్ న్యూస్:-పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన సామాజికవేత్త & సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు భారతదేశంలోని 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులందరూప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు(దరఖాస్తులు) చేసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత & అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఓటు అనేది ప్రతి ఒక్కరికి వజ్రాయుధమని అన్నారు. ఓటు హక్కు అనేది ఎవరిని ఎన్నుకోవాలి, ఎవరిని గద్దె దించాలనీ నిర్వహిస్తున్నారు. నమోదు చేసుకోవడానికి అర్హతలు 01 అక్టోబర్, 2008వ సంవత్సరం లేదా అంతకు ముందు జన్మించిన వారు ఓటు హక్కు కు అర్హులనీ అన్నారు.



కావాల్సిన పత్రాలు:

ఆధార్ కార్డు జిరాక్స్, జనన ధృవీకరణ పత్రం జిరాక్స్ /లేదా 10వ తరగతి(ఎస్ఎస్ సి) మార్క్ లిస్ట్ జిరాక్స్ / ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టిసి), 2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, కుటుంబ సభ్యుల్లో ఒకరి ఓటర్ ఐడీ జిరాక్స్, మొబైల్ నంబర్ లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గ్రామ / వార్డు సచివాలయంలో, మీ సేవ (Mee Seva) కేంద్రంలో, NVSP పోర్టల్: www.nvsp.in లో నమోదు చేసుకొని, ఆ రసీదు, మీ ఆధారాలు స్థానిక (బి ఎల్ వో)బూతు లెవెల్ ఆఫీసర్ కు గాని, స్థానిక (వీఆర్వో) విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ కు సమర్పించాలన్నారు. వారు పరిశీలన చేసి, ఎలక్షన్ (ఆర్వో)రిటర్నింగ్ ఆఫీసర్ కు పంపిస్తారన్నారు. అప్పుడు మనకు కొత్త ఓటు వస్తుందన్నారు.మీ ఓటు – మీ హక్కుఓటరుగా నమోదు చేసుకోండి-మన భారతదేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండని యువతి, యువకులకు పిలుపునిచ్చారు. ఏ ఎన్నికలు జరిగినా కూడా మనదేశంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకొని, మంచి నేతలు ఎన్నుకోవాలి అన్నారు.

విద్యకు ప్రాధాన్యత -అభివృద్ధికి పెద్దపీట

:- ఎమ్మెల్యే గిత్త.జయసూర్య

పాములపాడు ఆగస్టు-31 రిపబ్లిక్ న్యూస్:-

పాములపాడు మండలంలోని,రుద్రవరం గ్రామంలో నూతనంగా నిర్మించబోయే పాఠశాల భవనానికి నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త.జయసూర్య, ప్రభుత్వ అధికారులతో, నాయకులతో కలిసి భూమి పూజ నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త.జయసూర్య మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి, నాణ్యమైన విద్యకు అనుకూలమైన వాతావరణం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే గిత్త.జయసూర్య కు ఆరోగ్య ఉప కేంద్రానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ హెల్త్ సూపర్వైజర్ రత్నమ్మ, ఎమ్ ఎల్ హెచ్.పి- కే.జీ.మమత, ఏఎన్ఎం కే.కృష్ణవేణమ్మ, ఆశ వర్కర్లు ఎం.లక్ష్మీదేవి, కే.సుధారాణి లు వినతి పత్రం సమర్పించడం జరిగింది.

ఇంటింటికి కూటమి ప్రభుత్వం రెండేళ్ల సంక్షేమ పాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్త.జయసూర్య

పాములపాడు మండలంలోని,రుద్రవరం గ్రామంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త.జయసూర్య, ప్రభుత్వ అధికారులతో,



నాయకులతో కలిసి డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త.జయసూర్య, నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజవర్గ టిడిపి అబ్జర్వర్ జి.వెంకట శివుడు యాదవ్, టిడిపి మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, భానుముక్కల బండ్లమూరి వెంకటేశ్వరరావు, మద్దూరు జి.తిమ్మరెడ్డి , ఎర్ర గూడూరు చెల్లె.హరినాథ్ రెడ్డి, శివ శంకర స్వామి, పాములపాడు సొసైటీ చైర్మన్ సి.గోవిందు, ఎంపీటీసీ రాచపూడి అరుణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం భాషా, నాయకులు రాచపూడి సురేష్ (అడ్వకేట్), టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం.మోహన్ గౌడు, టిడిపి పాములపాడు మండల కల్చర్ అధ్యక్షుడు భావన వినోద్ కుమార్, జూటూరు హఫీజ్, నాయిని కృష్ణ, రుద్రవరం మధుసూదన్ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ కరిముల్లా, నాగయ్య, శ్రీనివాసులు, చిన్న వెంకటసుబ్బయ్య, షాలు, అల్లా బకాష్, నాగరాజు, రవీంద్ర, నరేష్, గోవిందు, చిన్న బాబుసా, ఇంతియాజ్, షేక్.రఫీ, షేక్.హుస్సేనాలం, ఉస్మాన్ భాష, మహబూబ్ బాషా, రహంతుల్లా, వాజిద్, రమణయ్య, ప్రభుత్వ అధికారులు ఎంఈఓ-1 బాలాజీ నాయక్, తహసిల్దార్ జి.సుభద్రమ్మ, ఎస్ఐ- పి.తిరుపాలు, ఇన్చార్జి ఎంపీడీవో- సులోచన, వివిజి రాంజీ పథకం ఏపీఓ- బి.జయంతి, ఐకెపి ఎపిఎం- ఏ.ఉమామహేశ్వరి, ఆర్డబ్ల్యూఎస్ జేఈ-సువర్చల, రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి.ఖాజాబీ, ఎమ్మెల్యే గవర్నమెంట్ పిఏ- రవీంద్ర, కానిస్టేబుళ్లు ఎం.టావేశ్వరుడు, ఎన్.ఎం.కె.చౌదరి, తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

కుల, వర్గ రాజకీయాలతో కాంగ్రెస్‌ను బలహీనపరిచే కుట్రలు సహించం

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.. రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పోటీ

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 31)

కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీలో కుల, వర్గ రాజకీయాలను ప్రోత్సహిస్తూ పార్టీని బలహీనపరిచేందుకు కొందరు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల జిల్లా చైర్మన్లు ఆరోపించారు. పార్టీ అంతర్గత సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లకుండా సామాజిక మాధ్యమాలు, పత్రికల ద్వారా బహిరంగ విమర్శలకు దిగడం సరికాదని వారు హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.

కర్నూలులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివిధ విభాగాల జిల్లా చైర్మన్లు మాట్లాడారు. 140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో నిర్దిష్టమైన సిద్ధాంతాలు, నియమ నిబంధనలు ఉన్నాయని, ప్రతి నాయకుడు వాటికి కట్టుబడి పనిచేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఎన్.సి.హెచ్. బజారన్న మాట్లాడుతూ పార్టీకి నష్టం కలిగించేలా కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం తగదన్నారు. పార్టీ నాయకత్వంపై అభ్యంతరాలు ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని, పార్టీని ధిక్కరించి బహిరంగంగా ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకే కులం ఆధారంగా రాజకీయాలు నడపడం సాధ్యం కాదని, కాంగ్రెస్‌లో అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

పార్టీ నాయకులను సంప్రదించకుండానే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం, చిన్నచిన్న విషయాలను వివాదాలుగా మార్చడం సరికాదని బజారన్న అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో జరిగిన కొన్ని ఘటనలపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. కర్నూలు జిల్లా కాంగ్రెస్ వ్యవహారాల్లో ఇతర జిల్లాలకు చెందిన నాయకులు జోక్యం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని, అయితే పార్టీ రాష్ట్ర కమిటీలను గతంలో ఏఐసీసీ ఆదేశాల మేరకు పీసీసీ రద్దు



చేసిందని బజారన్న పేర్కొన్నారు. అలాంటప్పుడు కర్నూలు జిల్లా ఇన్‌చార్జిగా ప్రచారం చేసుకునే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. పార్టీని వర్గాలుగా విడదీసే ప్రయత్నాలను ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బతుకన్న మాట్లాడుతూ కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీలో గతంలో ఎన్నడూ లేనివిధంగా వర్గ విభేదాలు, పరస్పర ఆరోపణలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్ష పదవిని కేంద్రంగా చేసుకుని కొందరు వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. పార్టీని ప్రశాంతంగా నడవనీయకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

కులమతాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీని ఒక కుటుంబంలా ముందుకు తీసుకెళ్లాల్సిన సమయంలో కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని బతుకన్న అన్నారు. పార్టీ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, నిబంధనలను పట్టించుకోకుండా వ్యక్తిగత సమావేశాలు నిర్వహించడం క్రమశిక్షణ ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు.

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై అధిష్టానం త్వరలో సరైన నిర్ణయం తీసుకుంటుందని బతుకన్న తెలిపారు. తప్పులు ఉంటే సరిదిద్దుకుని, పరస్పరం పెట్టుకున్న కేసులను ఉపసంహరించుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపించగలమన్నారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడు క్రాంతి నాయుడు అన్ని కులాలు, మతాలను గౌరవించే వ్యక్తి అని పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలను పార్టీ వేదికపై చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడిపై అన్యాయంగా కేసులు పెట్టడం సరికాదన్నారు. పార్టీపై అసంతృప్తి ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని, పార్టీని బహిరంగంగా విమర్శిస్తూ బజారుపాలు చేయవద్దని కోరారు.

జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఐఎన్‌టీయూసీ సిటీ అధ్యక్షుడు రేపల్లె ప్రతాప్ మాట్లాడుతూ ఒక నియోజకవర్గ ఇన్‌చార్జి డీసీసీ అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు పెట్టడం సమంజసం కాదన్నారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ ద్వారా సమగ్ర నివేదిక ఆధారంగా ఏఐసీసీ కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా క్రాంతి నాయుడిని నియమించిందని, అలాంటి నియామకాన్ని ప్రశ్నించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే అంతర్గత విభేదాలకు స్వస్తి పలికి, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అందరూ ఐక్యంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కర్నూలు జిల్లాలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని వారు ప్రకటించారు. రాహుల్ గాంధీ, వైఎస్ షర్మిలా రెడ్డి నాయకత్వంలో పార్టీని బలోపేతం చేసి భవిష్యత్తులో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో గోనెగండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముల్లా ఖాసీం వలి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఒసామా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై చట్టబద్ధ చర్యలు తీసుకుని న్యాయం చేస్తాం

: డీఎస్పీ ఉపేంద్రబాబు

-కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ

- మొత్తం 99 ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 31)

ప్రజల సమస్యలపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఉపేంద్రబాబు తెలిపారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మొత్తం 99 ఫిర్యాదులు అందాయి. అందిన ఫిర్యాదుల్లో ఉద్యోగాల పేరుతో మోసం, కుటుంబ కలహాలు, భూ ఆక్రమణలు, వృద్ధుల పట్ల



నిర్లక్ష్యం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి.

కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన మనోజ్ కుమార్ తాను డిగ్రీ పూర్తి చేసిన అనంతరం విశ్వనాథ్ అనే వ్యక్తి విఆర్వో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. జి.శింగవరం గ్రామానికి చెందిన అయ్యమ్మ తన కుమారులు అన్నం పెట్టకుండా ఇంటి నుంచి బయటకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే ఆదోని ప్రాంతానికి చెందిన చల్లా పాండురంగ, చల్లా శ్రీనివాసులు ఉరుకుందలో తమ వ్యవసాయ భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కర్నూలు నాగేంద్రనగర్‌కు చెందిన శ్రీనివాసరావు తన చిన్న కుమారుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.అందిన ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి, చట్టపరంగా చర్యలు తీసుకుని బాధితులకు త్వరితగతిన న్యాయం చేస్తామని డీఎస్పీ ఉపేంద్రబాబు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్రబాబుతో పాటు సీఐలు రామయ్యనాయుడు, గుణశేఖర్ బాబు పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర అవార్డుల ఎంపికకు పకడ్బందీ ప్రతిపాదనలు సమర్పించాలి

'స్వచ్ఛ ఆంధ్ర' అవార్డుల పోటీల్లో నంద్యాల జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం ఉత్తమ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

పరిశీలనకై ఐదుగురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, ఆగస్టు. 31 (రిపబ్లిక్ న్యూస్).
స్వచ్ఛాంధ్ర అవార్డుల ఎంపిక ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అన్ని శాఖలు, సంస్థలు చురుగ్గా పాల్గొని, ఉత్తమ ప్రతిపాదనలను నిర్దేశిత గడువులోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం స్వచ్ఛాంధ్ర అవార్డులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....స్వచ్ఛాంధ్ర అవార్డులకు సంబంధించిన 21 అంశాలలో 66 రాష్ట్ర స్థాయి అవార్డులు, 1662 మంది జిల్లా స్థాయి అవార్డులు ప్రకటించిన నేపథ్యంలో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో అత్యధిక అవార్డులు దక్కేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అవార్డుల స్క్రూటినీ మరియు పర్యవేక్షణ కోసం డిఆర్డిఎ పిడి, పిడి మెప్మా, డిప్యూటీ సీఈఓ, నంద్యాల మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారిలతో కూడిన ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెల్ఫ్ అసెస్మెంట్ నివేదికల సమర్పణకు ఆగస్టు 31 చివరి తేదీ కాగా, అన్ని ప్రతిపాదనలు తక్షణమే డిప్యూటీ సీఈఓకు అందజేయాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ సెప్టెంబర్ 8వ తేదీ నాటికి వీటిని క్షుణ్ణంగా పరిశీలించి 'స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్'కు నివేదిస్తుందని, అనంతరం థర్డ్ పార్టీ బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అవార్డులను ఖరారు చేస్తుందన్నారు. ప్రతిపాదనలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ మరియు ఫొటోలు, రికార్డులు పక్కాగా ఉండాలని, స్వచ్ఛత కోసం చేపట్టిన పనులను స్పష్టంగా వివరించాలన్నారు.
నామినేషన్లు పూర్తి వివరాలు మరియు కలర్ ఫొటోలతో కూడిన నివేదికను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వివిధ విభాగాల్లో అవార్డుల వివరాలు

క్రమసం.	విభాగాలు	రాష్ట్ర స్థాయి అవార్డులు	జిల్లా స్థాయి అవార్డులు
1.	స్వచ్ఛ మున్సిపాలిటీలు (జిల్లాలోని 6 మున్సిపాలిటీల కమిషనర్లు సమగ్ర నివేదికలు అందించాలి)	6 అవార్డులు	1 అవార్డు
2.	స్వచ్ఛ గ్రామ పంచాయతీలు	6 అవార్డులు	5 అవార్డులు
3.	స్వచ్ఛ SLFలు (మెప్మా)	3 అవార్డులు	3 అవార్డులు
4.	స్వచ్ఛ గ్రామ సమాఖ్యలు (వివి ఎస్)	3 అవార్డులు	5 అవార్డులు
5.	స్వచ్ఛ పాఠశాలలు	3 అవార్డులు	5 అవార్డులు
6.	స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలు	3 అవార్డులు	5 అవార్డులు
7.	స్వచ్ఛ ఆసుపత్రులు	4 అవార్డులు	3 అవార్డులు
8.	స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు (కలెక్టరేట్ సహా ప్రభుత్వ కార్యాలయాలు)	3 అవార్డులు	3 అవార్డులు
9.	స్వచ్ఛ ఆర్టీసీ బస్ స్టేషన్లు	3 అవార్డులు	1 అవార్డు
10.	స్వచ్ఛ రైతు బజార్లు	3 అవార్డులు	1 అవార్డు
11.	స్వచ్ఛ సంక్షేమ వసతి గృహాలు (ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ)	4 అవార్డులు	4 అవార్డులు
12.	స్వచ్ఛ ఎంఎస్ఎంఈలు	3 అవార్డులు	3 అవార్డులు
13.	స్వచ్ఛ ఎన్జీవో (NGOs)	3 అవార్డులు	3 అవార్డులు
14.	స్వచ్ఛ వారియర్స్ (అసోసియేషన్ - అభ్యర్థి)	3 అవార్డులు	5 అవార్డులు
15.	స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్స్	3 అవార్డులు	5 అవార్డులు
16.	స్వచ్ఛ రెసిడెన్షియల్ పాఠశాలలు (ప్రైవేట్, బీసీ, సోషల్ వెల్ఫేర్)	3 అవార్డులు	1 అవార్డు
17.	స్వచ్ఛ కాలనీలు	3 అవార్డులు	1 అవార్డు
18.	పర్యాటక ప్రాంతాలు	1 అవార్డు	1 అవార్డు
19.	ప్రముఖ దేవాలయాలు	1 అవార్డు	1 అవార్డు
20.	బెస్ట్ రైల్వే స్టేషన్	1 అవార్డు	1 అవార్డు
21.	మొత్తం అవార్డులు	65 అవార్డులు	63 అవార్డులు

బూత్ కన్వీనర్‌కు ఘన సన్మానం..

రామన్న గౌడ్‌కు టీడీపీ నేతల శభాష్!

100 శాతం లక్ష్యం పూర్తి చేసినందుకు ప్రత్యేకంగా అభినందనలు



దేవనకొండ, ఆగస్టు 31 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-
దేవనకొండ మండల టీడీపీ కార్యాలయ ఆవరణలో బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు.సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ నాయకులు సూచించారు.
క్షేత్రస్థాయిలో బూత్ కన్వీనర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ప్రజలకు ప్రభుత్వ పథకాల వివరాలను చేరవేయడంలో చురుగ్గాపనిచేయాలని సూచించారు.గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.ఈ సందర్భంగా లక్ష్యాన్ని 100 శాతం పూర్తి చేసిన కుంకనూరు గ్రామ టీడీపీ బూత్ కన్వీనర్ ఆర్. రామన్న గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.రామన్న గౌడ్ పనితీరును టీడీపీ నాయకులు ప్రశంసించారు.ఆయన కృషి ఇతర బూత్ కన్వీనర్లకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని సూచించారు.ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు కోరారు.కార్యకర్తల సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.రామన్న గౌడ్ సన్మానం పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది.కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూలు నగరానికి సరికొత్త రూపు

ప్రధాన కూడళ్ల సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళికలు.. : టర్ఫ్ గడ్డి, వాటర్ ఫౌంటెన్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం

డివైడర్లు, నడకబాటల అభివృద్ధితోపాటు పచ్చదనం పెంపునకు చర్యలు : నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 31)
నగరంలోని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసి, సుందరీకరణతోపాటు పచ్చదనాన్ని పెంచి కర్నూలు నగరానికి సరికొత్త రూపాన్ని తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. కోట్ల విజయభాస్కరరెడ్డి కూడలి, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్, మౌర్య ఇన్ తదితర కూడళ్లు, డివైడర్లను ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగాల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను పరిశీలించిన కమిషనర్, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పచ్చదనం పెంపునకు ఉన్న అవకాశాలపై అధికారులతో చర్చించారు. నగరంలోని తొమ్మిది ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.ప్రధాన కూడళ్లలో టర్ఫ్ గడ్డి ఏర్పాటు చేయడంతోపాటు, ఇప్పటికే ఉన్న వాటర్ ఫౌంటెన్లను మరింత అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న డివైడర్లకు ఆకర్షణీయమైన రంగులు వేయడం, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడం, నడకబాటలను అభివృద్ధి చేయడం వంటి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.రహదారుల వెంట పచ్చదనం మరింత పెరిగేలా కొత్త మొక్కలు నాటడంతోపాటు, ఇప్పటికే ఉన్న మొక్కలను సమర్థవంతంగా సంరక్షించాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. ప్రతి కూడలికి ప్రత్యేక డిజైన్ రూపొందించి, అక్కడి పరిసరాలకు అనుగుణంగా ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం, గోడలపై ఆహ్లాదకరమైన చిత్రాలను ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని తెలిపారు.నగరానికి ప్రధాన ప్రవేశ మార్గాలుగా, ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రాంతాలుగా కూడళ్లు ఉంటాయని



కమిషనర్ పేర్కొన్నారు. అందువల్ల ప్రతి కూడలిని ప్రత్యేకంగా అభివృద్ధి చేసి నగరానికి ప్రత్యేక ఆకర్షణగా మార్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సుందరీకరణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చగా, సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు.
ఈ పరిశీలనలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్‌రెడ్డి, హార్టికల్చర్ ఏడీ ప్రతాప్‌రెడ్డి, డీఈఈ కృష్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ సెక్రటరీ

డబ్బులు తీసుకున్న శానిటరీ వర్కర్ అరెస్టు

పంచాయతీ కార్యాలయంలో ఏసీబీ సోదాలు





అనంతపురం రూరల్, ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్):
ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ కోసం లంచం డిమాండ్ చేసిన రుద్రంపేట పంచాయతీ-1 సెక్రటరీ ఇనాయితుల్లా ఏసీబీకి చిక్కిన ఘటన అనంతపురం రూరల్ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. సెక్రటరీ సూచనల మేరకు లంచం నగదు తీసుకుంటున్న పంచాయతీ శానిటరీ వర్కర్ కంబగిరిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ ఇనాయితుల్లాను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పరిధిలోని ప్లాట్‌లో నాలుగు సెంట్ల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు నాగేంద్ర ప్లాన్ అప్రూవల్ కోసం పంచాయతీ సెక్రటరీ ఇనాయితుల్లాను సంప్రదించారు. ప్లాన్ అప్రూవల్ కోసం రూ.10 వేలు లంచంగా ఇవ్వాలని సెక్రటరీ డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అయితే అంత మొత్తం ఇవ్వలేనని నాగేంద్ర చెప్పడంతో రూ.8 వేలకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని నాగేంద్ర ఈ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం రూ.8 వేల నగదుతో ఓ టీ స్టాల్ వద్దకు రావాలని సెక్రటరీ నాగేంద్రకు సూచించినట్లు అధికారులు తెలిపారు. నాగేంద్ర టీ స్టాల్ వద్దకు చేరుకున్న అనంతరం పంచాయతీ శానిటరీ వర్కర్ కంబగిరి అక్కడికి వచ్చాడు. సెక్రటరీ ఇనాయితుల్లా చెప్పడంతోనే డబ్బులు తీసుకోవడానికి వచ్చినట్లు కంబగిరి పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో కంబగిరి రూ.8 వేల లంచం నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కంబగిరిని విచారించగా సెక్రటరీ ఇనాయితుల్లా సూచనల మేరకే తాను నగదు తీసుకున్నట్లు వెల్లడించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో సెక్రటరీ ఇనాయితుల్లాను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. లంచం నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు కేసు దర్యాప్తు చేపట్టారు.అనంతపురం ఏసీబీ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రుద్రంపేట పంచాయతీ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నారు. కేసుకు సంబంధించిన పత్రాలు, ఇతర వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి.. పదో తరగతిలో 500 మార్కులు సాధించిన వారికి రూ.10 వేల నగదు బహుమతి

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 31)
కృష్ణగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు.విద్యార్థుల హాజరు శాతం, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసిన ఎంపీ.. పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా పరిస్థితులు, పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ క్రమశిక్షణతో చదువుకుని



ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు తన సొంతంగా రూ.10 వేల నగదు బహుమతి అందజేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రకటించారు. విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించి, మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంపీ నాగరాజు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బోధనా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను ఉపాధ్యాయులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు

డీఎల్డీవో కార్యాలయం ముట్టడిస్తాం -సిఐటియు



బండి ఆత్మకూరు, ఆగస్టు 31, (రిపబ్లిక్ న్యూస్):- పారిశుద్య కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే డీఎల్డీవో కార్యాలయం ముట్టడిస్తామని సీఐటియు నాయకులు హెచ్చరించారు.
బండి ఆత్మకూరు మండలంలో ఏపీ పారిశుద్ధ్య కార్మిక సంఘం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ధర్నా కార్యక్రమం సిఐటియు నాయకులు శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు రత్నమయ్య మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు నెలలు తరబడి పెండింగ్ వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిల్లల చదువులు, హాస్పటల్ ఖర్చులు, పెరిగిన ధరలతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు చాలీచాలని జీతం, జీతం ఎప్పుడు వస్తుందో తెలియనీ ఉద్యోగం. పారిశుద్య కార్మికులు గ్రామాలను శుభ్రపరుస్తూ ప్రజలకు ఉద్యోగులకు అనేక రకాల సేవలు చేస్తున్న కార్మిక కుటుంబాలను ఆదుకోవాడంలో మాత్రం పాలకులు మీనమేషాలు లెక్కిస్తారని వారు మండి పడ్డారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అదనపు పనులు చేయిస్తే అదనపు కూలి ఇవ్వాలన్నారు. చెత్త బండ్ల రిపేరుకు డ్రస్సు మెడికల్ కిట్స్ శానిటేషన్ బ్లౌజులు బూట్లు వెంటనే ఇవ్వాలని విన్నవించారు. విధి నిర్వహణలో ఉండి ప్రమాద వశాత్తూ ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ. 21 వేలు చెల్లించాలని కోరారు. పైసమస్యలు పరిష్కరించకపోతే డిపిఎల్ఓ ఆఫీస్ ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ పద్మావతమ్మ, మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్మికులు కాద్రయ్య, ప్రతాప్, పుల్లయ్య, సాధన ,మోజెస్, శేఖర్, మీకాయల్ తదితరులు పాల్గొన్నారు.

గత 5 సంవత్సరాలు రైతుల గురించి పట్టించుకోని వైసీపీ నాయకులు

పబ్లిసిటీ కోసమే వైసీపీ నాయకుల రైతు పోరాటం

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

ఆళ్లగడ్డ ఆగష్టు 31 రిపబ్లిక్ న్యూస్
నంద్యాలలోని కేసీ కెనాల్ ఆఫీసులో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ
గత ఐదు సంవత్సరాలు రైతుల గురించి మాట్లాడని పట్టించుకోని వైసిపి నాయకులు ఈరోజు కేవలం రాజకీయం చేయడం కోసమే వైసిపి నాయకులు కండువాలు వేసుకొని, వారి పబ్లిసిటీ కోసమే ఇదంతా చేస్తున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆరోపించారు.
జిల్లాలో ఉన్నటువంటి 150 చెరువులకు నీటిని నింపడం కచ్చితంగా జరుగుతుందని ఎందుకంటే రైతులకు నీరు చాలా అవసరమని, తెలియజేశారు, ఈరోజు శిల్పా రవి రైతుల కోసం పోరాడుతున్నానంటూ మాట్లాడుతున్నాడు, మీ శిల్పా వెంచర్ వల్ల ఎంతమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారో మీకు తెలియదా, వాటి గురించి



మాట్లాడండి.
భూమా నాగిరెడ్డి బ్రతికున్నప్పుడు వెలుగోడు నుంచి ప్రతి ఒక్క ఇంటికి పైప్ లైన్ వేపించి 150 కోట్ల రూపాయలతో వర్కులు చేపించడం జరిగిందని, మళ్లీ చంద్రబాబు నాయుడు వచ్చిన తర్వాత అమృత్ స్కీం క్రింద వర్క్ చేపించి ప్రతి ఒక్కరికి నీరు అందే లాగా చూశారని, మీ జీవితంలో ఎప్పుడైనా ఇలాంటి మంచి పనులు చేశారా అంటూ శిల్పా రవిని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రశ్నించారు.
మీరైనా ఇక్కడ నంద్యాల లలో ప్రశ్నిస్తున్నారు, మా ఆళ్లగడ్డలో వైసీపీ నాయకులు నిద్రపోతున్నారు వారికి అవగాహన లేదు, ఆళ్లగడ్డలో ప్రతిపక్షం మేమే అధికారపక్షం కూడా మేమే, ఈరోజు కేసీ కెనాల్ సంబంధిత అధికారులతో మీటింగ్ పెట్టుకోవడం జరిగిందని, రెండు రోజుల్లో అన్ని చెరువులకు నీరు రావడం జరుగుతుందని, సంబంధిత మంత్రి మరియు కలెక్టర్ తో మాట్లాడడం జరిగిందని, ఇవన్నీఈ వైసీపీ నాయకులు ముందే తెలుసుకొని ఈరోజు రైతుల కోసం వైసీపీ నాయకులు ధర్నా చేస్తున్నట్లు నటించారు.
27 బ్లాక్ వరకు కచ్చితంగా నీరు విడుదల చేస్తారని త్రాగునీటి సమస్య ఎక్కడ కూడా ఉండదని ప్రతి ఒక్కరికి తెలియజేసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ రైతులందరికీ ఒకటే తెలియజేస్తున్నాము చెరువులకి ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా నీరు అందించిన తర్వాత ఉన్న నీటిని, ఆరుతడి పంటలకు నీరు అందిస్తామని తెలియజేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు.

41 ఏళ్ల వైద్య సేవలకు వీడ్కోలు

బేతాపల్లి పీహెచ్‌సీలో బీకే సుధారాణి పదవీ విరమణ సన్మాన సభ

గుత్తి, ఆగస్టు 31(రిపబ్లిక్ న్యూస్):



వైద్య ఆరోగ్యశాఖలో 41 ఏళ్ల పాటు ప్రజలకు సేవలందించిన బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బీకే సుధారాణి పదవీ విరమణ సన్మాన సభ సోమవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ కే. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, బంధుమిత్రులు, ఆత్మీయులు పాల్గొని సుధారాణికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్ఎంగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన సుధారాణి అనంతరం సూపర్‌వైజర్, పీహెచ్ఎన్, సీహెచ్ఓ తదితర వివిధ కేడర్లలో విధులు నిర్వహించారు. 41 సంవత్సరాల సుదీర్ఘ సేవా కాలంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ అధికారుల, ప్రజల మన్ననలు పొందారని పలువురు పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి సహచర సిబ్బందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.ఈ సందర్భంగా డాక్టర్ కే. ప్రవీణ్‌కుమార్, డాక్టర్ దేవేంద్రనాయక్ మాట్లాడుతూ సుధారాణి అందించిన సేవలను అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆమె శేష జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం సుధారాణిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.కార్యక్రమంలో కే.సీ. రెడ్డమ్మ, సి. వెంకటేష్, డిప్యూటీ హెచ్ఈఓ, నిరీష, గీత, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొన్నారు.

వృద్ధ మహిళలే టార్గెట్

రెండు చైన్ స్నాచింగ్ కేసులు ఛేదించిన పోలీసులు

అనంతపురం క్రైమ్, ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్):





ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లే వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అనంతపురం పోలీసులు అరెస్ట్ చేశారు. గత జూన్, జూలై నెలల్లో చోటుచేసుకున్న రెండు చైన్ స్నాచింగ్ ఘటనలను పోలీసులు సవాల్‌గా తీసుకుని ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో ఎస్ఐలు ఋషి, కరిష్మా, రామకృష్ణ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చేపట్టి ఎట్టకేలకు వారిని పట్టుకున్నాయి.

సోమవారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ పుల్లయ్య మాట్లాడుతూ షేక్ షాహిద్, బండారు విజయ్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు ఎరుపు రంగు అపాచీ ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లే వృద్ధ మహిళలను టార్గెట్ చేసేవారు. ఒంటరిగా నడుస్తున్న మహిళలను గమనించి వారి మెడలోని బంగారు గొలుసులను అపహరించి అక్కడి నుంచి వేగంగా పరారయ్యేవారని పోలీసులు తెలిపారు.నిందితుల నుంచి రెండు బంగారు గొలుసులు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లు, ఒక రాడ్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల అరెస్టుతో రెండు చైన్ స్నాచింగ్ కేసులు ఛేదించినట్లు తెలిపారు.ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లే మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సీఐ పుల్లయ్య సూచించారు. ముఖ్యంగా ఖరీదైన ఆభరణాలు బయటకు కనిపించేలా ధరించి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మెడలోని గొలుసులు కనిపించకుండా కొంగు లేదా దుపట్టాను కప్పుకోవడం ద్వారా చైన్ స్నాచింగ్‌లకు అవకాశం లేకుండా చూసుకోవాలని సూచించారు.వాకింగ్ సమయంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112 లేదా డయల్ 100కు సమాచారం అందిస్తే పోలీసులు తక్షణమే స్పందిస్తారని సీఐ పుల్లయ్య తెలిపారు.

భూ వివాదంలో మహిళ మృతి

అనుమానాలున్నాయంటున్న కుమారులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్):



భూమి, రస్తా వివాదం నేపథ్యంలో దాదాపుగా 29 రోజులక్రితం ఓ మహిళ మృతి చెందడంతో అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం మదిగుబ్బ తాండాలో కలకలం రేపింది.తాండాకు చెందిన సరస్వతి అనే మహిళ ఉరి వేసుకుని మృతి చెందిన ఘటనపై పలు అనుమానాలు ఉన్నాయని ఆమె కుమారులు రమావత్ మారుతి నాయక్, అమర్నాథ్ నాయక్ ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు పోలీసులను కోరారు.కుమారులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం మదిగుబ్బ తాండా గ్రామంలో సర్వే నంబర్ 70లో తమకు 4. 25 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన రస్తా విషయంలో ఇరు వర్గాల మధ్య గత పదేళ్లుగా వివాదం కొనసాగుతోందని పేర్కొన్నారు. రస్తా కోసం గోవింద నాయక్, ఆయన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా చంద్రనాయక్ తమను వేధిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని మారుతి నాయక్ చెప్పారు. ఈ క్రమంలో తమ తల్లి సరస్వతి మృతి చెందిందని, ఆమె మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని కుమారులు తెలిపారు. ఇది ఆత్మహత్య కాదని, తమ తల్లి మృతికి చంద్ర నాయక్ వేధింపులే కారణమని వారు తీవ్ర ఆరోపణలు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయలేదని మారుతి నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూడా సంబంధిత వ్యక్తులు బయట తిరుగుతూ తమను బెదిరిస్తున్నారని, వారి నుంచి తమకు, తమ కుటుంబానికి ప్రాణ హాని ఉందని వాపోయారు.తమ తల్లి మృతిపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టి తమకు రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని రమావత్ మారుతి నాయక్, అమర్నాథ్ నాయక్ పోలీసు, రెవెన్యూ అధికారులను కోరారు.

వృద్ధాశ్రమంలో భాస్కరనాయుడు జన్మదిన వేడుకలు

తాడిపత్రి సంక్షేమం, ఆగస్టు 31,(రిపబ్లిక్ న్యూస్):



జన్మదిన వేడుకలను వృద్ధుల సమక్షంలో జరుపుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని జాతీయ రైతు పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా భాస్కరనాయుడు తెలిపారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని తాడిపత్రిలోని శ్రీ శివకృష్ణ వృద్ధాశ్రమంలో సోమవారం హ్యూమన్ రైట్స్ గ్లోబల్ మిషన్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా భాస్కరనాయుడు మాట్లాడుతూ రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గతంలో వివిధ సంస్థల ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల జాతీయ రైతు పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. పదవిని బాధ్యతగా భావించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలుస్తానని తెలిపారు.కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ గ్లోబల్ మిషన్ సొసైటీ ఫౌండర్, చైర్మన్ కాకర్ల సరస్వతి, జనరల్ సెక్రటరీ కర్ణకుమార్, అదనపు జనరల్ సెక్రటరీ నాగబాబు, అడ్వకేట్ ఫరీదా, చిప్పల లక్ష్మి, పద్మజ, కేశవనాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, రవికుమార్, జయకృష్ణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పార్థసారథి - ఘనంగా సంచార జాతుల విముక్త దివస్ వేడుకలు







అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్):

సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల సాధికారత, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు ఎన్డీఏ ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉన్నాయని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల చరిత్ర, సంస్కృతి, ఆత్మగౌరవం, హక్కులు, అభ్యున్నతిని చాటిచెప్పే ఉద్దేశంతో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం నగరంలో సంచార జాతుల విముక్త దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంచార జాతులకు చెందిన ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. నగరంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించిన ప్రదర్శనల్లో ఆయా జాతుల సంప్రదాయ కళలు, సంస్కృతి, వేషధారణలు, కళారూపాలు ప్రతిబింబించడంతో నగరం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

హక్కులకు భరోసా కల్పించడమే ఎన్డీఏ ప్రధాన లక్ష్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ దేశ చరిత్రలో తరతరాలుగా వివక్ష, అణచివేతకు గురైన సంచార జాతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. బ్రిటిష్ పాలనలో క్రిమినల్ యాక్ట్ పేరుతో అనేక సంచార జాతులు ఎదుర్కొన్న వివక్ష, ఇబ్బందులను అధిగమించి వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డీనోటిఫైడ్ కమిషన్ బోర్డుల ఏర్పాటు, అర్హులైన వారికి గుర్తింపు కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.సంచార జాతులు తమ సంప్రదాయ వృత్తులతో పాటు ఆధునిక విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, నివాసం వంటి రంగాల్లో వారికి అవసరమైన సహకారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సంచార జాతుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారి హక్కులకు భరోసా కల్పించడమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని స్పష్టం చేశారు.

సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలి

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ.. తరతరాలుగా వివక్షకు గురైన సంచార జాతుల చరిత్ర, వారి పోరాటాలు, ఆత్మగౌరవాన్ని భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో విముక్త దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంచార జాతుల సంక్షేమం, సామాజిక సాధికారత కోసం ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో 38 సంచార తెగలు, దేశవ్యాప్తంగా 1,400కు పైగా సంచార జాతులు ఉన్నాయని తెలిపారు. ఆయా వర్గాల సమస్యలను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సంచార జాతులు విద్య, ఉపాధి, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందుకు సాగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.వేడుకల్లో భాగంగా సంచార జాతులకు చెందిన ప్రజలు తమ సంప్రదాయ కళలు, సంస్కృతిని ప్రదర్శించారు. కళాకారుల ప్రదర్శనలు, సాంప్రదాయ వేషధారణలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగర ప్రధాన వీధుల్లో నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై సంచార జాతుల సంస్కృతిని తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె దేవానంద్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, స్టేట్ సెల్స్ కన్వీనర్ కణంపల్లి చిరంజీవిరెడ్డి,మోర్చా రాష్ట్ర కార్యదర్శులు ఆర్.అశోక్ , బీజేపీ, ఓబీసీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, వివిధ సంచార తెగల పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ కోసం కాంట్రాక్టు నర్సుల పోరుబాట

డిమాండ్ల సాధనకు సామూహిక సంతకాల సేకరణ -మద్దతు తెలిపిన సీఐటీయూ, కార్మిక సంఘాలు



అనంతపురం వైద్యం, ఆగస్టు 31,(రిపబ్లిక్ న్యూస్):

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నర్సుల ఆందోళన 11వ రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిమాండ్లకు మద్దతుగా సామూహిక సంతకాల సేకరణ చేపట్టారు.

వైద్య, ఆరోగ్యశాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతోపాటు ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకుల నుంచి కూడా సంతకాలు సేకరించారు. కాంట్రాక్టు నర్సుల ఆందోళనకు సీఐటీయూతోపాటు పలు కార్మిక సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు.

మరణించిన కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఈ సందర్భంగా ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్టు నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నర్సులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు సమాన వేతనాలు అందించాలని కోరారు.రెగ్యులరైజేషన్‌కు కొంత సమయం పడితే అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన కాంట్రాక్టు ఉద్యోగుల్లో పలువురు మృతిచెందారని, మరికొందరు కుటుంబ సభ్యులను కోల్పోయారని ఆమె తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ పరస్పర బదిలీల సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు.ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఒకే చోట ఒకే పని చేస్తున్న ఉద్యోగులకు వేర్వేరు వేతనాలు

సీఐటీయూ నాయకుడు నాగేంద్ర మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలను కోరడం లేదని, చట్టబద్ధంగా తమకు రావాల్సిన హక్కులనే అడుగుతున్నారని అన్నారు. ఒకే చోట ఒకే పని చేస్తున్న ఉద్యోగులకు వేర్వేరు వేతనాలు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. పలు రాష్ట్రాల్లో కాంట్రాక్టు విధానాన్ని తొలగిస్తున్నప్పటికీ ఇక్కడ కొనసాగించడం సరికాదన్నారు. న్యాయస్థానాల సూచనలు, తీర్పులను కూడా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సీఐటీయూ అండగా నిలుస్తుందని తెలిపారు.కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంతి, వైస్ ప్రెసిడెంట్ సుజిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణమ్మ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చాందిని, జేఏసీ కన్వీనర్ లావణ్యతోపాటు మహేష్, వలి, అశోక్, పవన్, కెఫె అనంతలక్ష్మి, మాధవి తదితరులు, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.



ఘనంగా గౌరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు

శకునాల గ్రామం హరికృష్ణ గౌడ్ మురళి రెడ్డి మధు గౌడ్ గౌరువెంకట్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

ఓర్వకల్ ప్రతినిధి, ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్)

నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు,నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు నందికొట్కూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గౌరు వెంకటరెడ్డిని పూలమొక్కలు, గజమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. శకునాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా హాజరై వెంకటరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన వారికి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హరి గౌడ్, మౌలీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నమ్మిన వారికి అండగా నిలవడం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం గౌరు వెంకటరెడ్డి ప్రత్యేకతలని అన్నారు. ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం చూపుతున్న తపన స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో ఆయన మరింత ఉత్సాహంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

ప్రజాసేవలో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.గౌరు వెంకటరెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో శకునాల గ్రామానికి చెందిన ఈ. మధు గౌడ్, ఈ. హరికృష్ణ గౌడ్, మౌలీశ్వర్ రెడ్డి, బాల్ రెడ్డి, గన్ రెడ్డి, తిరుమలేశు, సాకలి సీఎం, గొల్ల సుబ్బయ్య, బోయ చంద్రశేఖర్, టీడీపీ తిరుపాలు, డాక్టర్ అశోక్, చాకలి చింతల్, చాకలి రంగ, ఈడిగ గీత, మహేష్ గౌడ్, మంగలి మహేష్, శీలం బుచ్చన్న, శీలం వర్ధన్ బాబు, శకునాల యువ నాయకుడు వినోద్ కుమార్, బోయ నాగేశ్వరావు, దేవి, సువార్తమ్మ, పల్లె చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు. దాదాపు100 వంద మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై గౌరు వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ సర్పంచ్ చంగల్ రెడ్డి భౌతికాయానికి నివాళులర్పించిన ధ్వజ రెడ్డి.





రైల్వే కోడూరు ఆగస్టు 31 రిపబ్లిక్ న్యూస్. చిట్వేలి మండలం చిట్వేల్లి అగ్రహారానికి చెందిన మాజీ సర్పంచ్ చంగల్ రెడ్డి మృతి చెందినట్లు తెలుసుకున్న రాష్ట్ర వైఎస్ఆర్సిపి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, రైల్వే కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజ రెడ్డి మృతుని స్వగృహం చేరుకొని ఆయన భౌతికయానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ప్రగడ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు చంగల్ రెడ్డి మృతి ఆ కుటుంబానికి పార్టీకి తీరని లోటుని ఆయన లేడిని లోటు పుడత లేనిదని సందర్భంగా ధ్వజారెడ్డి అన్నారు కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు కార్యక్రమంలో చిట్వేలి వైస్ ఎంపీపీ సుబ్రమణ్యం రెడ్డి సీనియర్ నాయకులు ప్రదీప్ రెడ్డి మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య బాలు లక్ష్మీకర్ చిట్వేలి టౌన్ ప్రెసిడెంట్ హజరత్ రెడ్డి, రామయ్య వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని చంగల్రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

నేరడిగుంట సర్పంచ్ ఒగ్గు సాయి కిరణ్ యాదవ్





అందోల్ ప్రతినిధి ఆగస్టు 31(రిపబ్లిక్ న్యూస్)నేరడిగుంట గ్రామానికి చెందిన బేగరి నర్సింలు గారు నిన్న మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సాయికిరణ్ గారి తల్లి వొగ్గు వసంత గారు నర్సింలు గారి కుటుంబాన్ని పరామర్శించి, రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్ గారు, వార్డు సభ్యులు ఎర్రోళ్ల రవి గారు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

మన సంస్కృతికి ప్రతిబింబాలు రాయికల్ గుడికోట దేవాలయాలు



రాయికల్ మండలం ఆగస్టు,31(రిపబ్లిక్ న్యూస్)

దేవాలయాలు మన సంస్కృతి ప్రతిబింబాలని రాయికల్ మేడిపల్లి భీమారం మండలాలకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమికోన్నత, ఆదర్శ, కస్తూర్బా తదితర పాఠశాలలో జాతీయ భాష హిందీ బోధన చేసే పండితులు అన్నారు. పాఠశాల సముదాయం సమావేశంలో భాగంగా సోమవారం భోజన విరామ సమయంలో జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని చారిత్రాత్మక కట్టడం గుడికోట ను సందర్శించి ఆనాటి శిల్పకళా వైభవాన్ని కొనియాడారు. జీవకళ ఉట్టి పడేలా శిల్పాలు చెక్కిన శిల్పులు ధన్యులని పేర్కొన్నారు.దాదాపు ఏడు శతాబ్దాల క్రితం క్రీ.శ.1305 లో త్రికూటాలయం వంటి కళాఖండాన్ని నిర్మించిన లకుమాదేవి కృషిని ప్రస్తుతించారు. ఆమె అజరామర కీర్తిని పొందారని అన్నారు.
ఈ కార్యక్రమంలో హిందీ రిసోర్స్ పర్సన్స్ తిరు కోవెల నారాయణ మేనేని నీలిమ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కూరగాయల సురేష్, మల్లేశం, రమేష్, గంగాధర్, స్వప్న, సుజాత, పద్మ, యశోద తెలుగు ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు

రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ మాతృమూర్తి పార్థిక దేహానికి..

నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్





రాయికల్ మండలం ఆగష్టు, 31(రిపబ్లిక్ న్యూస్)జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ తల్లి కట్కం లక్ష్మి మరణిస్తే ఆమె పార్థిక దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తన వెంట జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్లవాణి భర్త శ్రీనివాస్, రాయికల్ సింగిల్ విండో అధ్యక్షులు ఏన్గు మల్లారెడ్డి, రాయికల్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,సిశీగని రమేష్, ఇంతియాజ్, మత్స్య శేఖర్, వాసం రాజేందర్,మ్యాకల సత్యనారాయణ వెంటఉన్నారు

ధర్నాలు.... రాస్తారోకోలు ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 31(రిపబ్లిక్ న్యూస్)

సంగారెడ్డి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు 30, 30(ఎ) పోలీస్ చట్టం 1861 ప్రకారం సెప్టెంబర్ 1వ తేది నుంచి 30వరకు అమలులో ఉంటుందని సూచించారు. జిల్లా పరిధిలో ముందస్తు పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, మైకు పెట్టుకుని తిరగడం, సభలు, సమావేశాలు, నిరాహార దీక్షలు నిర్వహించరాదన్నారు.ప్రజా ధనానికి నష్టం కలిగించే, చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదని ఎస్పీ స్పష్టంచేశారు. జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు నిర్వహించే నిఘా, బందోబస్తుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. ఒకవేళ పోలీసుల అనుమతి లేకుండా సమావేశాలు ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు

రూ.68 లక్షల వ్యయంతో విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభోత్సవం

ముక్కా రూపానందరెడ్డి





రైల్వే కోడూరు ఆగస్టు 31 రిపబ్లిక్ న్యూస్.
చిట్వేలి మండలం సి. కందులవారిపల్లి గ్రామం లో 68 లక్షల రూపాయల వ్యయంతో విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలను నిర్మించారు,,ప్రజలకు అవసరమైన వైద్య, పరిపాలనా సేవలను మరింత చేరువ చేసే దిశగా రెండు కీలక భవనాలు అందుబాటులోకితీసుకు వచ్చారు . రూ.36 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.32 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని బాలు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించగా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఖాది పరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరి ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు మరియు కూటమి నాయకులతో కలిసి రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సోమవారం ప్రారంభించారు,
ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని అన్నారు. గ్రామంలోనే ప్రాథమిక వైద్య సేవలు లభించడం వల్ల చిన్నచిన్న అనారోగ్య సమస్యల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు.
విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్యం, ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు వంటి సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.అదేవిధంగా నూతన గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి రావడం వల్ల గ్రామ పరిపాలన మరింత సౌకర్యవంతంగా కొనసాగుతుందని ముక్కా రూపానంద రెడ్డి అన్నారు. పంచాయతీ కార్యాలయం ప్రజలకు ప్రభుత్వ సేవలు, స్థానిక పరిపాలనకు సంబంధించిన కార్యక్రమాలు అందించే ప్రధాన కేంద్రంగా ఉంటుందని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించేందుకు పంచాయతీ వ్యవస్థ కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోలి లారీ సుబ్బరాయుడు, కాకర్ల నాగార్జున మరియు పలు ముఖ్య నాయకులు,చీనూ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కమిషనర్ జబ్బార్‌మియా పదవీ విరమణ

42 ఏళ్ల సుదీర్ఘ ప్రభుత్వ సేవలకు వీడ్కోలు

గుత్తిలో ఘనంగా సన్మానం..

మున్సిపల్ కార్యాలయం నుంచి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ

రాజకీయ నాయకులు, అధికారులు, సిబ్బంది, ప్రజల అభినందనలు



గుత్తి ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్):
గుత్తి మున్సిపల్ కమిషనర్ బడేమల్లి జబ్బార్‌మియా 42 ఏళ్ల సుదీర్ఘ ప్రభుత్వ సేవలకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. మున్సిపల్ కమిషనర్‌గా గుత్తి పట్టణ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అందించిన సేవలను అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, పట్టణ ప్రజలు కొనియాడారు. పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది. మున్సిపల్ కార్యాలయం నుంచి స్పందన ఫంక్షన్ హాల్ వరకు ఆయనను ఘనంగా ర్యాలీగా తీసుకెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

రైతు కుటుంబం నుంచి ప్రభుత్వ ఉద్యోగం వైపు..

జబ్బార్‌మియా 1964 సెప్టెంబరు 1న కర్నూలు జిల్లా ఆత్మకూరు తాలూకాలోని నల్లమల అటవీ ప్రాంతం, కృష్ణానది తీరంలో సంగమేశ్వర ఆలయానికి సమీపంలోని ముసలిమడుగు గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. అబ్దుల్ రహీం సాహెబ్, రమీజాబి దంపతుల కుమారుడైన ఆయనకు ఇద్దరు సోదరులు, ముగ్గురు సోదరీమణులు ఉన్నారు. గ్రామీణ వాతావరణంలో బాల్యాన్ని గడిపిన ఆయన చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి కనబరిచారు.
ముసలిమడుగులో అప్పట్లో విద్యుత్ సౌకర్యం కూడా సరిగా లేని పరిస్థితుల్లో ఏడో తరగతి వరకు విద్యాభ్యాసం చేశారు. అనంతరం పాతకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఇందుకోసం ప్రతిరోజూ సుమారు ఏడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి హైస్కూల్ విద్యను పూర్తి చేశారు. ఆత్మకూరు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, కర్నూలు ఉస్మానియా కళాశాలలో బీఎస్సీ, కర్నూలు మెడికల్ కళాశాలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సును పూర్తిచేశారు.

తాడిపత్రితో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభం

1985 డిసెంబరు 27న తాడిపత్రి మున్సిపాలిటీలో హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది తాడిపత్రి మున్సిపాలిటీలో దాదాపు పదేళ్లపాటు సేవలందించారు. 1996 నుంచి 2005 వరకు తాడిపత్రిలో విధులు నిర్వహించారు.
2005 నుంచి 2012 వరకు హిందూపురం మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. 2013 నుంచి 2015 వరకు నంద్యాల మున్సిపాలిటీలో సేవలందించారు. అనంతరం 2018 నుంచి 2019 వరకు గుంతకల్లు మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.

కమిషనర్‌గా బాధ్యతలు..


ఉద్యోగ ప్రస్థానంలో మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన జబ్బార్‌మియా 2020 నుంచి 2022 సెప్టెంబరు వరకు రాయదుర్గం మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేశారు. అనంతరం 2022 సెప్టెంబరు నుంచి 2023 వరకు తాడిపత్రి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తదుపరి చిత్తూరు మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా సేవలందించారు.
2024 జనవరి నుంచి ఆగస్టు వరకు మైదుకూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేశారు. 2024 ఆగస్టు 24న బదిలీపై గుత్తి మున్సిపాలిటీలో చేరారు. అప్పటి నుంచి దాదాపు రెండేళ్లపాటు గుత్తి మున్సిపల్ కమిషనర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందారు.

అన్ని ప్రాంతాల్లో మన్ననలు..

దాదాపు 42 ఏళ్లపాటు వివిధ హోదాల్లో ప్రభుత్వానికి సేవలందించిన జబ్బార్‌మియా తాను పనిచేసిన ప్రతి ప్రాంతంలో నిబద్ధతతో విధులు నిర్వహించారని పలువురు కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ, మున్సిపల్ పరిపాలన తదితర అంశాల్లో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలతో సమన్వయంతో పనిచేసి వారి మన్ననలు పొందారని తెలిపారు.

ఆత్మీయ వీడ్కోలు..

పదవీ విరమణ సందర్భంగా గుత్తి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. జబ్బార్‌మియా ఇంతకుముందు పనిచేసిన మున్సిపాలిటీలకు చెందిన అధికారులు, సిబ్బంది కూడా కార్యక్రమానికి హాజరై ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.



పదవీ విరమణ అనేది ప్రభుత్వ ఉద్యోగ జీవితంలో సహజమైన ప్రక్రియ అయినప్పటికీ, సుదీర్ఘకాలం తమతో కలిసి పనిచేసిన అధికారి సేవల నుంచి వైదొలగడం బాధాకరంగా ఉందని పలువురు పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి స్పందన ఫంక్షన్ హాల్ వరకు జబ్బార్‌మియాను ఘనంగా ర్యాలీగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

శేష జీవితం సుఖసంతోషాలతో సాగాలి..

పదవీ విరమణ అనంతరం జబ్బార్‌మియా కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, ఆనందంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఆకాంక్షించారు. ఆయన అందించిన సేవలను గుత్తి మున్సిపాలిటీతోపాటు తాను పనిచేసిన ప్రాంతాల ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పలువురు పేర్కొన్నారు. జబ్బార్‌మియా సేవలపట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పి.డి.ఎస్. సన్న బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

జిల్లా పౌర సరఫరాల అధికారిమెదక్ జిల్లా

మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్)



మెదక్ జిల్లా రేషన్ కార్డు దారులకు తెలియజేయునది ఏమనగా, పి.డి.ఎస్. ద్వారా సన్న బియ్యం పంపిణీ గడువును 05.09.2026 వరకు పొడిగిస్తూ కమిషనర్, పౌర సరఫరాల శాఖ, తెలంగాణ, హైదరాబాద్ గారు అవకాశం కల్పించారు.
ఈ విషయాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి (డి సీ ఎస్ ఓ), మెదక్ గారు తెలియజేశారు. కావున ఇప్పటివరకు పి.డి.ఎస్. సన్న బియ్యం పొందని రేషన్ కార్డు దారులు ఈ అదనపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సంబంధిత చౌక ధరల దుకాణం (ఎఫ్ షాప్) ద్వారా తమకు కేటాయించిన సన్న బియ్యాన్ని 05.09.2026లోపు పొందవలసిందిగా కోరడమైనది.
అదేవిధంగా, జిల్లాలోని అన్ని చౌక ధరల దుకాణాల డీలర్లు నిర్ణీత సమయానికి దుకాణాలను తెరిచి ఉంచి, అర్హత కలిగిన రేషన్ కార్డు దారులందరికీ 100% పి.డి.ఎస్. సన్న బియ్యం పంపిణీ చేయాలి. బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం వహించినా, దుకాణాలను నిర్ణీత సమయానికి తెరవకపోయినా లేదా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురిచేసినా, సంబంధిత డీలర్లపై నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడతాయి.

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై 420 హామీలపై చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన చంటి క్రాంతి కిరణ్ మాజీ ఎమ్మెల్యే



ఆందోల్ ప్రతినిధి ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్)

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పట్లోల్ల జైపాల్ రెడ్డి గారి స్వగృహంలో గౌరవ మాజీ ఎమ్మెల్యే శ్రీ చంటి క్రాంతి కిరణ్ గారు మీడియా సమావేశంలో పాల్గొన్నారు 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై పార్టీ అధిష్టానం ఆదేశాలు మేరకు సెప్టెంబర్ 2వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల పైన నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నాం కావునా ఆందోల్ నియోజకవర్గంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు రైతులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి అని గౌరవ మాజీ ఎమ్మెల్యే శ్రీ చంటి క్రాంతి కిరణ్ గారు పిలుపు నిచ్చారు

ఫీజు రియాంబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

- సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు



కరీంనగర్, ఆగస్టు 31,(రిపబ్లిక్ న్యూస్): గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న 7500 కోట్ల ఫీజుల రియంబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని పూర్తిగా అమలు చేయాలని సామాజిక కార్యకర్త,కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ఈబీసి పేద విద్యార్థులు ఉన్నత విద్య చదువుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, అందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో 70 వేల కోట్ల రూపాయలను బడా కాంట్రాక్టర్ల విడుదల చేసి బడుగు విద్యార్థులకు 7500 కోట్ల ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం చాలా సిగ్గుచేటు అంటారు.ప్రభుత్వం ఫీజులు మంజూరు చేయకపోవడం మూలంగా కళాశాల యజమాన్యాలు విద్యార్థులను ఫీజులు చెల్లించాలని వేధించడంతో 32 మంది విద్యార్థులు ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకున్నారని విద్యార్థుల బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాధిస్తే సాధించిన తెలంగాణలో మరొకసారి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక సంరక్షణ అందరి బాధ్యత : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఘనంగా రాఖీ వేడుకలు

మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్)
రాఖీ పౌర్ణమి సందర్భంగా బేటీ బచావో బేటీ పడావో (బి బి బి పి) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో విద్యార్థినులు జిల్లా కలెక్టర్ తోపాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు రాఖీలు కట్టి, బాలికల రక్షణ, విద్య, సమానత్వం మరియు సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలనే సందేశాన్ని అందించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..బాలికల హక్కులు, భద్రత, విద్య భవిష్యత్ అభివృద్ధికి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు.
బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి విద్యను ప్రోత్సహించడం, సురక్షితమైన వాతావరణాన్ని





కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాఖీ వేడుకల ద్వారా అన్నాచెల్లెళ్ల అనుబంధంతో పాటు బాలికల భద్రత గౌరవాన్ని కాపాడాలనే సామాజిక బాధ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొని బాలికలను రక్షిద్దాం బాలికలను చదివిద్దాం అనే బి బి బి పి సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి,బాలికలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

జగిత్యాల యావర్ రోడ్డుకు ఇకనైనా మోక్షం ఎప్పుడు?

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న విస్తరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారా!!

-తక్షణమే పనులు ప్రారంభించి.. ప్రజల ఇబ్బందులు తొలగించాలి -జనసేన నాయకులు బెక్కం జనార్దన్

రాయికల్ మండలం ఆగస్టు.31 (రిపబ్లిక్ న్యూస్)
జగిత్యాల పట్టణంలోని యావర్ రోడ్డు విస్తరణ సమస్యకు ఇకనైనా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజావాణిలో జనసేన పార్టీ జగిత్యాల జిల్లా సీనియర్ నాయకుడు బెక్కం జనార్దన్ జిల్లా కలెక్టర్‌ను కోరారు ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు
యావర్ రోడ్డు ఇరుకుగా ఉండటంతో నిత్యం వాహనదారులు, పాదచారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాహనాల రాకపోకలు పెరగడంతో తరచూ ట్రాఫిక్ రద్దీ



ఏర్పడటంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా ఉందన్నారు ఈ విషయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎప్పుడు మాట్లాడిన యవరు రోడ్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చేతుల మీదుగా దీని శంకుస్థాపన చేస్తామని అనడం సంవత్సరలు గడుస్తున్నాదని ఆయన విమర్శించారు రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణ, ఆస్తుల తొలగింపు, పరిహారం తదితర అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.
భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడం, ప్రభావిత ఆస్తుల యజమానులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించడం, అవసరమైన నిధులు కేటాయించి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. రోడ్డు పక్కన ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ నియంత్రణకు తాత్కాలిక చర్యలు చేపట్టాలని సూచించారు.ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న యావర్ రోడ్డు సమస్యను అత్యవసర ప్రజా సమస్యగా పరిగణించి, పనులకు గడువు నిర్ణయించి త్వరితగతిన పూర్తి చేయాలని బెక్కం జనార్దన్ డిమాండ్ చేశారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి -డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్





మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్)సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 48 దరఖాస్తులను స్వీకరించారు.అందులో భూ భారతి 16, ఇందిరమ్మ ఇండ్లు 6,పెన్షన్ 1, ఇతర 25 మొత్తం 48 దరఖాస్తులను స్వీకరించారుఈ సందర్భంగా డి ఆర్ ఓ అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించి పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు స్పందిస్తూ, వినతులను పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చైనా రాజధాని బీజింగ్ లో జరిగే అండర్ -15 సాఫ్ట్ బాల్

ఆసియా కప్ కి ఎంపికైన మంగంపేట వాసి అవికారాయ్.







రైల్వే కోడూరు ఆగస్టు 31 రిపబ్లిక్ న్యూస్.
మారుమూల గ్రామం ఓబులవారిపల్లి మండలం మంగంపేట ఏపీఎండిసి పబ్లిక్ స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న లావులూరి అతికిరాయి అక్టోబర్ 11 నుండి 18 వరకు జరిగే సాఫ్ట్బాల్ క్రీడలో భారతదేశం తరఫున ఏపీ లోని తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలం మంగంపేట గ్రామానికి చెందిన అతికరాయ్ నిరుపేద కుటుంబానికి చెందిన లావులూరి చరణ్ కుమార్తె,అండర్ 15 ఆసియా కప్ చైనాలో జరగనున్న సాఫ్ట్ బాల్ క్రీడలకు భారత తరఫున ఎంపిక అయింది. మంగంపేటలోని ఏపీఎండిసి పబ్లిక్ స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న లావులూరి అవికా రాయ్ ని సాఫ్ట్ బాల్ పట్ల ఆసక్తి ఉండడంతో చెన్న రాజు పోడు ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించే వ్యాయామ ఉపాధ్యాయుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించడం జరిగింది. ఆయన ఆధ్వర్యంలో అవికారై మంచి శిక్షణ తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదుగుతుందన్నారు ఈ క్రమంలో పలు మండల స్థాయి, జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో మెరుగైన ప్రతిభ కనబరిచింది. ఏపీ సాఫ్ట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి సహకారంతో చైనాలో జరగనున్న ఆసియా సాఫ్ట్ బాల్ ఆటకు ఎంపికైంది అవికారాయ్ తండ్రి లావులూరి చరణ్ వ్యాయామ ఉపాధ్యాయుడు అబ్దుల్లా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు అసిస్టెంట్ హెడ్మాస్టర్ అహమ్మద్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశాడు ఏపీ తరఫున బిజింగ్ లో పాల్గొనేందుకు వెళ్ళనున్నట్లు తెలియడంతో పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు, బంధుమిత్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.అవికా రాయ్ మాట్లాడుతూ తమ గురువు అబ్దుల్లా ప్రోత్సాహంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నేను ఈ స్థాయికి వచ్చానని మన దేశం తరఫున ఆడుతున్నందుకు సంతోషంగా గర్వంగా ఉందని బీజింగ్ లో జరిగే ఆటలలో మంచి ప్రతిభ కనబరిచి దేశానికి గౌరవం మెడల్ తీసుకొచ్చేందుకు సాయి శక్తుల కృషి చేస్తానని ఆమె తెలిపింది. ఆమె గురువు అబ్దుల్లా మాట్లాడుతూ విజయనగరంలో జరిగే క్రీడలకు మా పాఠశాలకు సంబంధించిన క్రీడాకారులు ఎంపికైనందుకు ఆనందంగా ఉందని తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే సహాయ సహకార లభిస్తే పిల్లలను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతానని అన్నారు.

రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ తల్లి లక్ష్మి మృతిచెందగా ఆయా కుటుంబాలను పరిమర్శించిన మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి తల్లి గంగమ్మజగిత్యాల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ చక్రధర్ తల్లి మీనాక్షమ్మ చనిపోగా వారి రెండు కుటుంబాలను పర్మర్శించిన అడువల జ్యోతిలక్ష్మన్







రాయికల్ మండలం ఆగస్టు.31(రిపబ్లిక్ న్యూస్)
జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవి గారి తల్లి లక్ష్మీ అనారోగ్యం తో మరణించగా వారి కుటుంబ సభ్యులను,అలాగే ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి తల్లి గంగమ్మ అనారోగ్యంతో మరణించగా, అలాగే జగిత్యాల ప్రముఖ వైద్యులు డాక్టర్ చక్రాదర్ డా. ఈశ్వరమ్మ, డాక్టర్ అమరేశ్వరి, డాక్టర్ శ్వేత వాళ్ళ అమ్మ మీనాక్షమ్మ అనారోగ్యంతో మరణించగా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, ఆమె వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్ వీరబత్తిని శ్రీనివాస్, కొక్కుల రమేష్ మరియు పలువురు పాల్గొన్నారు.


ప్రభుత్వ భూమిలోనుండి రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నారాయణఖేడ్ ప్రతినిధి ఆగస్టు 31(రిపబ్లిక్ న్యూస్)నారాయణఖేడ్ మండలంలోని పీర్లతాండా వద్ద ప్రభుత్వ అసైన్డ్ భూమిలో నుండి అక్రమంగా రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు అనుముల తుకారాం అన్నారు. సోమవారం ఆయన ఖేడ్ లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీర్లతాండా వద్ద కొందరు వ్యక్తులు ప్రభుత్వ అసైన్డ్ భూమిలోనుండి అక్రమంగా ఫార్మ్ ల్యాండ్ కోసం 120/50 సర్వే నంబర్ నుండి 40 ఫీట్ల వెడల్పుతో విశాలమైన రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు అన్నారు.సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ చంద్రమోహన్ రెడ్డి,నాయబ్ తహసీల్దార్ రాజు పాటిల్,గిర్దావర్ మాధవరెడ్డిలు రోడ్డు వేస్తున్న ప్రదేశానికి వెళ్లి పనులను నిలిపివేసిన తిరిగి యధావిధిగా పనులు కొనసాగుతున్నాయి అన్నారు.తన 120/50/4/అ సర్వే నంబర్ లో నుండి తాండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా రోడ్డు వేశారని,వారిపై చర్యలు తీసుకోవాలంటూ పాతులోత్ ప్రేమ్ సింగ్ అనే వ్యక్తి ఈ నెల 8వ తేదీన ఖేడ్ పోలీస్ స్టేషన్ లో కూడా పిర్యాదు చేశాడు అన్నారు.తాండా పెద్ద మనుషులు ప్రేమ్ సింగ్ తో రాయబారం నడిపి నీకు చెందిన వేరే భూమికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని,ప్రస్తుతం నీ భూమిలోనుండి వేస్తున్న రోడ్డుకు అడ్డుకోరాదని చెప్పడంతో ప్రేమ్ సింగ్ అక్రమ రోడ్డుకు అడ్డుకోవడం లేదు అన్నారు.రియల్ ఎస్టేట్ యజమాని భూమికోసం మాత్రమే అసైన్డ్ భూమిలోనుండి అక్రమంగా రోడ్డు వేస్తున్నారని,రోడ్డు ఏర్పాటు వల్ల తాండా వాసులకు ఎలాంటి లాభం లేదు కాబట్టి అక్రమంగా ప్రభుత్వ భూమిలోనుండి రోడ్డు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు

డ్రోన్ కెమెరాలతో పోలీసులప్రత్యేక నిఘా.



రైల్వే కోడూరు ఆగస్టు 31 రిపబ్లిక్ న్యూస్.
అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ప్రజల సహకారంతో మరింత సమర్థవంతమైన పోలీసింగ్ నిర్వహించడం జరుగుతుందని సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ అన్నారు, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాస రావు పర్యవేక్షణలో, కోడూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి శ్రీనివాసులు, ఓబుళ వారి పల్లి సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ ఆధ్వర్యంలో పుల్లంపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.
ఇందులో భాగంగా ఓబుళ వారి పల్లి మండలం లోని చిన్న ఓరం పాడు, పెద్ద ఓరం పాడు, ఓబుళ వారి పల్లి గ్రామాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగించి ఆయా గ్రామాలు, శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు మరియు అనుమానాస్పద ప్రాంతాలపై అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ముఖ్యంగా పేకాట స్థావరాలు, కోళ్ల పందేలు, గంజాయి నిల్వ వినియోగానికి సంబంధించిన అనుమానాస్పద ప్రదేశాలు, బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలు తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేపట్టారు.
సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసుల సాధారణ నిఘాకు అందని ప్రాంతాలను కూడా పరిశీలిస్తూ, అనుమానాస్పద కదలికలను గుర్తించిన వెంటనే స్థానిక పోలీసు సిబ్బంది ద్వారా స్పందించి, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నారు.ప్రజల భాగస్వామ్యమే సమర్థవంతమైన పోలీసింగ్‌కు బలంఅని అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో వ్యవహరించినప్పుడే గ్రామాలు సురక్షితంగా, ప్రశాంతంగా ఉంటాయని పోలీసులు తెలిపారు.పేకాట, కోళ్ల పందేలు, గంజాయి వినియోగం లేదా విక్రయం, బహిరంగంగా మద్యం సేవించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినప్పుడు భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.యువత ముఖ్యంగా మత్తు పదార్థాలు, జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల స్నేహాలు, రోజువారీ కార్యకలాపాలు మరియు ఆన్‌లైన్ ప్రవర్తనపై కూడా తగిన అవగాహనతో పర్యవేక్షణ చేయాలని పోలీసులు సూచించారు.మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా అవసరాన్ని బట్టి డ్రోన్ నిఘాను విస్తరించి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.ప్రజలు పోలీసులతో సమన్వయంతో పనిచేసి, తమ గ్రామాల్లో అనుమానాస్పద కదలికలు లేదా అసాంఘిక కార్యకలాపాలను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, “సురక్షిత గ్రామం ప్రశాంత సమాజం” కోసం పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంతృప్తి స్థాయిని మెరుగుపర్చాలి

కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ త్వరితగతిన పూర్తి చేయాలి

ఐ-గాట్ కోర్సులను పూర్తి చేయాలి

"వన్ మంత్ - ఫోర్ విజిట్" ద్వారా అర్జీలపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, ఆగస్టు, 31 (రిపబ్లిక్ న్యూస్).
ప్రజా సమస్యలను నాణ్యతతో పరిష్కరించడం ద్వారా ప్రజా సంతృప్తి స్థాయిని మెరుగుపర్చాలి అధికారులు కృషి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....ప్రజా సమస్యలను మెరుగైన రీతిలో పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా పరిష్కరించిన అర్జీల నాణ్యత లు కూడా అర్జీదారుల నుండి వారి అభిప్రాయాన్ని సేకరించడం జరుగుతోందన్నారు. జిల్లాలో 90 శాతం మెరుగైన స్థానంలో పెన్షన్ పంపిణీ జరుగుతున్నప్పటికీ ప్రజా సంతృప్తి స్థాయి 87 శాతం తగ్గడంపై ఎంపిడిఓలు దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ఆర్ఓఆర్లో కూడా తక్కువ పురోగతి సాధించామని, ప్రజా సంతృప్తి స్థాయిని పెంచడానికి అర్జీదారుడికి కార్యాలయానికి పిలిపించి వారి అర్జీ పరిష్కరించడం ద్వారా ప్రజా సంతృప్తి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ఏ శాఖ వారికి ప్రజా సంతృప్తికి సంబంధించి ఫోన్ కాల్ ఏ రోజున వెళ్తుంది ? ఏ ప్రశ్నలు అడుగుతారు అనే అంశాలపై సమాచారం ఇచ్చినప్పటికీ ఇంకా పురోగతి సాధించలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కలెక్టర్ల సదస్సు త్వరలో ఉండే అవకాశం ఉన్నందున 39 కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ త్వరితగతిన అప్డేట్ చేయాలన్నారు. ముఖ్యంగా డిఈఓ, ఐసిడిఎస్, స్వర్ణగ్రామ-స్వర్ణవార్డుకు సంబంధించి అంశాలను 1వ తేదీలోగా నమోదు చేయాలన్నారు. గతంలో సి గ్రేడ్ లో 33 పారామీటర్స్ ఉంచడం జరిగిందని, ప్రస్తుతం ఏ ఒక్క పారామీటర్ కూడా తక్కువ స్థాయిలో ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐగాట్ కోర్సులకు సంబంధించి అందరూ జిల్లా అధికారులు నిర్దేశిత కోర్సులను పూర్తి చేయాలన్నారు. ఓవర్ డ్యూ ఉన్న కోర్సులను వెంటనే పూర్తి స్థాయిలో పూర్తి చేయాలన్నారు. విద్యా శాఖకు సంబంధించి ఇంకా 1200 మంది టీచర్లు, పోలీసులు 600 మంది ఇనాక్టివ్ గా ఉన్నారన్నారు. ఈ వారం చివరిలో ఐగాట్ కోర్సులు, ఉద్యోగుల గ్రీవెన్స్ తదితర అంశాలపై పూర్తి స్థాయిలో సమీక్షించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో బెస్ట్ ప్రాక్టీసెస్ కు సంబంధించి అమలు చేయాల్సిన అంశాలపై 8-10 స్లైడ్స్ లో ఉండేలా మంచి అంశాలను రూపొందించి పంపాలన్నారు. ఈ ప్రాజెక్టులు చేయడానికి గల కారణాలు, అందుకు అవసరమైన చొరవపై నివేదిక ఇవ్వాలని, ఈ కార్యక్రమం అమలు చేయడం ద్వారా జిల్లాలో రానున్న మార్పులు, రాష్ట్రం అంతటా అమలు చేస్తే వచ్చే అంశాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు మండలాల్లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నీటి ఎద్దడి దృష్ట్యా చిన్న మట్టి వినాయకులను పూజించాలి

నిమజ్జనం సమయంలో ఎటువంటి అపశ్రుతికి తావు ఉండకూడదు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, ఆగస్టు, 31 (రిపబ్లిక్ న్యూస్).
ఎల్నినో ప్రభావం దృష్ట్యా ఏర్పడిన నీటి పరిమాణం తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న మట్టి వినాయకులను పూజించాలి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వినాయక నిమజ్జనం సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించాల్సిన మండల స్థాయి సమన్వయ సమావేశంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....వినాయక చవితి పండుగ 14వ తారీఖున ఉన్నందున జిల్లాలో ఇప్పటి వరకే జిల్లా స్థాయి సమన్వయ సమావేశం పూర్తి అవ్వడం జరిగిందన్నారు. మండల కేంద్రాల్లో ఆర్డీవోలు, డీఎస్పీలు, డివిజనల్ స్థాయి అధికారులు వెంటనే డివిజనల్ లెవెల్ మీటింగ్లు, గ్రామ స్థాయి మీటింగ్లు నిర్వహించాలన్నారు. వినాయక నిమజ్జనం ప్రధానంగా 5వ రోజున జరుగుతోందని, కొన్ని మండలాల్లో 3వ రోజు, 4వ రోజు లేక అదే రోజే నిమజ్జనం చేయడం జరుగుతోందన్నారు. ఏ మండలాల్లో ఏ రోజు చేస్తారనే విషయాన్ని పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పెద్ద సమస్య నీళ్లు లేకపోవడం అని వినాయకుడిని నిమజ్జనం చేయడానికి కాలువల్లో, ట్యాంకుల్లో నీళ్లు తక్కువగా ఉన్నాయని ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని చిన్న మట్టి వినాయకులను పూజించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెద్ద విగ్రహాలు పెడితే విద్యుత్ తీగల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, విగ్రహాల వద్ద అనధికారికంగా విద్యుత్ లాగడం వంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో చర్చించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నీటి కొలనులు లేని చోట తాత్కాలిక చెరువు తవ్వి, నీరు నింపి క్రేన్ ద్వారా నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ దీనికి బాధ్యత వహించాలన్నారు. చాలా ఘాట్ల వద్ద చిన్న పిల్లలు విగ్రహాలను తీసుకువెళ్లి ప్రమాదవశాత్తు జారి పడిపోయే అవకాశం ఉన్నందున ఘాట్ల వద్దకు దిగేందుకు మెట్లు ఏర్పాటు చేయడం, చుట్టూ బ్యారికేడింగ్ వేయడం, సరైన లైటింగ్ ఏర్పాటు చేయడం స్థానిక సంస్థల బాధ్యత అన్నారు. తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజనీర్లే దీనికి ప్రత్యేకాధికారులుగా ఉంటారన్నారు. మండల స్థాయి అధికారుకట్మండలాల్లో ఘాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి, అక్కడ తగిన భద్రత, లైటింగ్ ఉండేలా చూడాలని, ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకూడదని, అవసరమైన చోట్ల నీరు నింపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మసీదులు, చర్చిల ముందు ఊరేగింపు ఎలా వెళ్లాలనే విషయాలపై స్పష్టత ఉండాలన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీకి అభివృద్ధి కోసం చేయూతను అందించండి

జీవితకాల సభ్యత్వం ద్వారా సొసైటీ అభివృద్ధికి కృషి చేయండి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల బ్యూరో, ఆగస్టు 31 (రిపబ్లిక్ న్యూస్).
జిల్లాలో రక్తనిల్వలను పూర్తి స్థాయిలో ఉంచాలనే సంకల్పంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు సంబంధించి ఉద్యోగులందరూ సభ్యులుగా నమోదు అవ్వాల్సిన అవసరం ఎంతగానో ఉంటుందని జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, డిఆర్ఓ రామునాయక్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.....జిల్లాలో రక్తనిల్వల కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ బలోపేతం కోసం జిల్లా పరిషత్ సిబ్బంది 30 మంది జీవితకాల సభ్యత్వం



తీసుకోగా రూ.33 వేలు ఇవ్వడం జరిగిందని, గతంలో కూడా ఎంపిడిఓలు, సూపరింటెండెంట్లు, జిల్లా పరిషత్ సిబ్బంది నుండి మొత్తం 56 మంది జీవితకాల సభ్యత్వం తీసుకోవడం ద్వారా రూ.61,600/- సమకూరడం జరిగిందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేయడానికి ఉద్యోగులందరూ కేవలం వెయ్యి రూపాయలు చెల్లించి జీవితకాల సభ్యతం తీసుకోవచ్చు అన్నారు. అదే విధంగా వైస్ పాట్రన్ కోసం రూ.12,500/-, పాట్రన్ కోసం రూ.2,5000/- చెల్లించాల్సి ఉంటుందని, గుర్తింపు కార్డు కోసం అదనంగా వంద రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సభ్యత్వం ఉన్న వారికి అతి తక్కువ రుసుముతో రక్తం అందించడం జరుగుతోందన్నారు. అదే విధంగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అవసరం ఉన్న సేవలు అందించడంతో పాటు అత్యవసర సమయంలో సిపిఆర్ చేయడం, బ్రహ్మోత్సవాల సమయంలో విధులు నిర్వహించడం జరుగుతోందన్నారు. అంతేకాకుండా జిల్లాలో అందించిన ఉత్తమ వైద్య సేవలకు గాను రాష్ట్ర గవర్నర్ గారు మెరుగైన ఆరోగ్యం అందించాలని సంకల్పంతో "మీ ఇంటికి - మీ డాక్టరు" క్రింద రూ.2 కోట్లతో అంబులెన్స్ హాస్పిటల్ ను పంపడం జరిగిందన్నారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని కూడా నియమించుకోవడం జరిగిందన్నారు. ఈ సర్వీసు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవసరమైన పూర్తి స్థాయి ఆరోగ్య సేవలు అందించడం జరుగుతోందన్నారు. అదే విధంగా డిఆర్ఓ, ఆర్డీఓలు, తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి సభ్యత్వం పెంచేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ కి జాయింట్ కలెక్టర్ గారు చైర్మన్గా ఉన్న నేపథ్యంలో యువ రక్తదాతలను పెంచేలా డిఈఓ, డివిఈఓ కృషి చేయాలన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 7 రోజులు జైలు శిక్ష



నంద్యాల క్రైం, ఆగస్టు 31, (రిపబ్లిక్ న్యూస్): మద్యం సేవించి మోటారు వాహనం నడిపిన వ్యక్తికి నంద్యాల స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి మద్దెల శ్రీనివాస రెడ్డి ఏడు (07) రోజుల సాధారణ కారాగార శిక్ష విధించారు. రోడ్డు ప్రమాదాల నుండి ప్రజలను రక్షించేందుకు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆర్.జి. సుబ్రమణ్యం, సిబ్బంది నంద్యాల పట్టణంలోని శ్రీనివాస నగర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని సాయిబాబా నగర్ కు చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి ఆటో వాహనాన్ని నడుపుతుండగా ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. అనంతరం అతనిని బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షించగా ఆల్కహాల్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచగా గౌరవ న్యాయమూర్తి ఏడు రోజుల సాధారణ కారాగార శిక్ష విధించారు. ఈ సందర్భంగా నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆర్.జి. సుబ్రమణ్యం మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారుల ప్రాణాలతో పాటు ఇతర ప్రయాణికులు, పాదచారుల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నడపవద్దని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. "డ్రంక్ అండ్ డ్రైవ్కు దూరంగా ఉండండి మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడండి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

పిజిఆర్ఎస్ కు 272 ప్రజా దరఖాస్తులు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల బ్యూరో, ఆగస్టు, 31 (రిపబ్లిక్ న్యూస్).
ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలను రీఓపెన్ కాకుండా ఉండే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క అర్జీదారుడి దరఖాస్తును నాణ్యతతో పరిష్కరించేలా కృషి చేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా అన్ని దరఖాస్తులను అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. రీఓపెన్ అర్జీలకు సంబంధించి 5,513 రీఓపెన్ కాగా 5,444 నాణ్యతతో పరిష్కరించామని మిగతా 69 వాటిని కూడా అర్జీదారుడితో మాట్లాడి నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. రీఓపెన్ దరఖాస్తుల్లో రెవెన్యూ, పంచాయతీ రాజ్ అత్యధికంగా రీఓపెన్ కావడం





జరిగిందని సంబంధిత శాఖలు దృష్టి సారించి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 137 అర్జీల స్వీకరణ

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తంగా 137 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 6, అడంగల్ సవరణలకు సంబంధించినవి 16, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 6, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 25, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్కు సంబంధించినవి 35, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 40, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 9గా ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు

1) బనగానపల్లె మండలం, కటికవనికుంట గ్రామానికి చెందిన వాడల సావిత్రి తన భర్త అనారోగ్యంతో మరణించారని, వితంతు పెన్షన్ మంజూరు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

2) వెలుగోడు మండలం, వెలుగోడు గ్రామానికి చెందిన వి.మధు సతీష్ తను పుట్టుకతోనే చూపులేనప్పటికీ డిగ్రీ విద్యను అభ్యసించడం జరిగిందని, ఆర్థికంగా చాలా ఇబ్బందులు గురవుతున్నామని, విద్యార్హత మేరకు ఏదైనా ఉపాధి కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

3) సిరివెళ్ళ మండలం, గుండంపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న స్మశానాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం





నంద్యాల క్రైం, ఆగస్టు 31, (రిపబ్లిక్ న్యూస్): జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్ వారి ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్లోని వి.సి.హాల్లో అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఖాదర్ బాషా అధ్యక్షతన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నియంత్రణ సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో ఎక్సైజ్, పోలీసు, విద్య, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, ఉద్యానవనం, అటవీ, రైల్వే, రవాణా, మహిళా మరియు శిశు సంక్షేమం, డ్రగ్ ఇన్స్పెక్టర్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాను డ్రగ్-ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసి, 20262029 మూడు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడం, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాట్లు చేసి వారికి కూడా అవగాహన కల్పించి పిల్లలను గమనిస్తూ వుండాలని, విద్యార్థులకు డ్రగ్-ఫ్రీ ప్రతిజ్ఞలను చేపించి మాదకద్రవ్యాల నిర్మూలనలో వారిని భాగస్వాములను చేసి దేశ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. విద్యాసంస్థల పరిసరాలను 500 మీటర్ల పరిధిలో "మాదకద్రవ్య రహిత ప్రాంతం"గా అభివృద్ధి చేయడంతో పాటు, విద్యాసంస్థల చుట్టూ 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయం, వినియోగాన్ని నిరోధిస్తూ సిఓటీపీఏ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు. డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు అనుమానము వారికి డ్రగ్ డిటెక్టివ్ కిట్స్ ఉపయోగించి,మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు గుర్తించిన వారికి కౌన్సెలింగ్ అందించి, అవసరమైతే డీ-అడిక్షన్ , పునరావాస కేంద్రాలకు పంపించి, వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యాసంస్థలు, హాస్టళ్లు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు, నిఘా మరింత పెంచడంతో పాటు, అలవాటుగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పి.ఐ.టీ ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ 1988 కింద చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రోన్ సర్వైలెన్స్, సీసీటీవీ నెట్వర్క్, సీసీటీఎన్ఎస్, డేటా అనలిటిక్స్, హాట్స్పాట్ మ్యాపింగ్, సోషల్ మీడియా మానిటరింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను ముందస్తుగా గుర్తించి అరికట్టాలని నిర్ణయించారు. ఎక్సైజ్, రైల్వే, రవాణా శాఖలతో సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీ-అడిక్షన్ కేంద్రాలను బలోపేతం చేయడం, అలాగే శికారిపేట, సిద్ధాపురం, ఆలేబాద్ తండా, చెంచు కాలనీలు వంటి సున్నిత ప్రాంతాల్లో అవగాహన, జీవనోపాధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు డ్రగ్స్కు సంబంధించిన సమాచారం లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అలాగే ప్రతి శాఖ ఒక సంవత్సరం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నెలవారీ పురోగతి నివేదికలు సమర్పించాలని , అన్ని శాఖలు సమన్వయంతో సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు నిర్దేశించిన కార్యాచరణను ఖచ్చితంగా అమలు చేయాలని అదనపు ఎస్పీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్లో కర్నూలు క్రీడాకారుల సత్తా

వివిధ విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో మెరిసిన క్రీడాకారులు

అభినందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 31)
రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్షిప్ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. తిరుపతిలో ఆగస్టు 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో అథ్లెటిక్స్, వెయిట్లిఫ్టింగ్, యోగా తదితర విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించారు. కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
అథ్లెటిక్స్ విభాగంలో అండర్-23 కేటగిరీలో 800 మీటర్ల



పరుగులో రామాంజనేయులు స్వర్ణ పతకం సాధించారు. అండర్-17 విభాగంలో మనీష్ అశ్విని కుమార్ నాయుడు రజత పతకం కైవసం చేసుకున్నారు. అండర్-23 విభాగంలో కె. మంజు 100 మీటర్ల పరుగులో కాంస్య పతకంతో పాటు హైజంప్లోనూ కాంస్య పతకం సాధించారు.
వెయిట్లిఫ్టింగ్లో 60 కిలోల విభాగంలో డి.జి. వీరేష్, 65 కిలోల విభాగంలో బి. వీరేష్ స్వర్ణ పతకాలు సాధించారు. +110 కిలోల విభాగంలో పర్వేజ్ ముషారఫ్ రజత పతకం, 75 కిలోల విభాగంలో అబ్దుల్ హక్ కాంస్య పతకం సాధించారు.
అండర్-17 బాలుర విభాగంలో 95 కిలోల కేటగిరీలో షేక్ అఫ్రుద్ స్వర్ణ పతకం సాధించగా, 70 కిలోల విభాగంలో షేక్ సాద్, 75 కిలోల విభాగంలో షేక్ జైద భాషా రజత పతకాలు సాధించారు. 65 కిలోల విభాగంలో వి. సాయి నితేష్ మూడో స్థానం సాధించి కాంస్య పతకం దక్కించుకున్నారు.
యోగా విభాగంలో ధన ధీరజ్ రజత పతకం సాధించి కర్నూలు జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణ, కఠోర శ్రమతో తమ ప్రతిభను మరింతగా మెరుగుపరుచుకోవాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో కర్నూలు జిల్లా ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్డీఓ) భూపతిరావు, వెయిట్లిఫ్టింగ్ కోచ్ యూసఫ్ భాష, అథ్లెటిక్స్ కోచ్ కాశిరావు తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com